ఆర్తనాదం

"సిగ్గూ లజ్జా లేదు ముండకి. బరితెగించింది. ఎవరి కొంప తీస్తాదో!
ఎవరి పీకలమీదికి తెస్తాదో!"

అన్నం గిన్నెం అరిగిపోతుందేమోనని సుతారంగా తోముతూ పెద్దగా స్వగతం చెప్పుకుంటోంది అప్పలమ్మ.

వంటింట్లో వుల్లిపాయలు కోస్తోన్న రాధకి ఆ రెండుమాటలూ వినిపించాయి – "ఎవర్ని అప్పలమ్మా? అలా దీవిస్తున్నావు?" అంటూ కళ్ళు నలుపుకొంటూ బయట కొచ్చింది.

"ఆ కన్నమ్మ ముండమ్మా!" గెన్నె అవతల పారేసి హుషారుగా చేతులు తిప్పుతూ – "ఇందాక రైలుకింద పడతానని బద్దీలమద్దిన నిలుచుందంట. గేంగు కూలీలు కూకలేసి తగిలేశారంట. నేనైతే ముండని రైలుకిందకే గెంటేదాన్ని" ఇనుమడించిన వుత్సాహంతో గిన్నె అందుకుంది.

"ఏం? ఎందుకు పడుతుంది రైలుకింద?"

"ఊరుకోమ్మా! నువ్వు మరీనూ. అదో ఎత్తు. జిత్తులమారి ముండ."

"పాపం.... కన్నమ్మంటే నీ కెందుకంత కోపం?"

"కోపం కాక మరేంటమ్మా? చెడిపోయిన ముండ" వారంరోజుల నుంచీ ఏకవరసగా తిట్టిపోస్తోంది అప్పలమ్మ ఆ కన్నమ్మని.

కన్నమ్మ ఎక్కణ్ణుంచో వచ్చిందట. ఇల్లిల్లూ అడుక్కు తింటోందట. అలా ఉన్నట్టే ఉండి ఇళ్ళకి నిప్పెడుతుందట. అంటే మొగవాళ్ళను వల్లో వేసుకుంటుందట_ వారం రోజులనుంచీ వూదర కొట్టినట్టు చెప్తోనే వుంది అప్పలమ్మ.

రాధ విని వూరుకోవటం తప్పితే ఆ మాటలేమీ పట్టించుకోలేదు. కన్నమ్మ ఎప్పుడూ రాధ గుమ్మంలోకి రాలేదు — ఆ కన్నమ్మంటే అప్పలమ్మకి ఎందుకంత కోపమో అర్థంకాలేదు_ "సరేలే! గిన్నెలు తొందరగా తీసుకురా" అని వెళ్ళిపోయింది! _ "ఇదిగో! తోముతున్నానమ్మా! నాలుగిళ్ళ పని చేసి చేసి చేతులు మంటలు పుడుతున్నాయి. నాకు సాగదమ్మా అంటే యినవు. నా పనే కావాలంటావు" స్వగతాలు చెప్పుకుంది అప్పలమ్మ.

ఆ రోజు మధ్యాహ్నం_ కొత్త పత్రికలు చదువుకుంటూ _ నిద్రలోకి జారిపోయింది రాధ.

మిట్టమధ్యాన్నం _ ఒంటిగంట దాటింది. ఎండ మిడిసిపడుతోంది. ఎవరో వీధితలుపు కొడుతూన్నట్టు లీలగా విన్పించింది. కీచుగొంతుకతో చంటిబిడ్డ ఏడుపు కూడా.... ఉలిక్కిపడి లేచింది రాధ. గబగబా వెళ్ళి తలుపులు తీసింది. గుక్కపట్టి ఏడుస్తోన్న పిల్లాణ్ని చేతుల్లో పెట్టుకుని కొయ్యబొమ్మలా నిలబడివుందా మనిషి. నల్లటి నలుపు_పొట్టి_స్ఫోటకం మచ్చలు—నిమ్మకాయంత ముడి_ఒళ్ళంతా కప్పని బారెడు గుడ్డ — కాళ్ళదగ్గర నల్లటి సంచి _ కళ్ళనిండా నీళ్ళు. "ఎవరు నువ్వు? ఏం కావాలి?" నిద్రమత్తుతో విసుక్కోకుండా అడిగింది రాధ.

ఆ మనిషి గబుక్కున కళ్ళు తుడుచుకుంది - గుటక మింగి బొంగురు కంఠంతో "అమ్మా! పిల్లోడు సచ్చిపోతాడేవో భయంగావుంది. పొద్దుట్నుంచి కడుపులో కేమీలేదు. ఎందర్నో అడిగాను. పో పొమ్మన్నారు. ఒక్క అణా డబ్బులియ్యి తల్లీ!" ఆ పాఠం ఎందరికో చెప్పినట్టు గడగడా చెప్పేసింది. కళ్ళలో నీళ్ళు జలజలా రాలిపడ్డాయి.

ఆ పిల్లాడు చేతుల్లో వుండటంలేదు. గింజుకుంటున్నాడు. మూడు నెలలకంటె ఎక్కువ వుండవు. మొహాన్నిబట్టి అనుకోవటంగానీ, కాళ్ళూ చేతులూ పుల్లల్లా వున్నాయి. రాధకి చాలా జాలేసింది. "డబ్బులిస్తాను గానీ నువ్వు పాలు కొని పట్టేసరికి చాలా ఆలస్యం అవుతుంది. మా యింట్లో కొంచెం పాలున్నాయి. వెచ్చబెట్టి ఇస్తాను. లోపలికిరా!"

ఆ మనిషి అలాగే నిలబడింది తెల్లబోయి. "ఫర్వాలేదు. అదుగో—అలా వాకిట్లోంచివెళ్ళు. పెరటివేపు వరండాలో కూర్చో, పాలు తెస్తాను.

రాధ లోపలికివెళ్ళి — స్టౌ వెలిగించి - పాలు, నీళ్ళూ కలిపి వెచ్చబెట్టి- పంచదార కలిపి - గ్లాసులోపోసి తీసుకువచ్చింది.

పిల్లాడు ఏడ్చే వోపిక లేక తల్లి చేతుల్లో వాలిపోయి కునుకుతూ పడుకున్నాడు.

"ఎలా పోస్తావు పాలు! చిన్న చెంచా యివ్వనా!"

"ఒద్దమ్మా! నా దగ్గర సీసా వుంది" ఆ మనిషి సంచిలోంచి రంగుసీసా తీసింది.

పిల్లాడిని తల్లి ఒళ్ళో పడుకోబెట్టుకుని పాలు పడుతోంటే రాధ పీటతెచ్చి వేసుకుని కొంచెం దూరంగా కూచుంది.

పిల్లాడు ఆవురావురుమంటూ పాలన్నీ తాగేశాడు. ఒళ్లోనే నిద్ర పోయాడు.

గచ్చుమీద ఓ పాతగుడ్డ పరచి వాణ్ణి పడుకోబెట్టింది తల్లి — "అమ్మా! కొంచెం ఈ కోకగుడ్డ పిండుకుంటాను. తడిపేశాడు. చెంబుతో కాసిని నీళ్ళిస్తారా?" అంది.

"అదిగో! ఆ స్నానాలగదిలో పంపు వుంది. వెళ్ళు. సుబ్బరంగా ఉతుక్కో" దారి చూపించింది రాధ.

ఆ మనిషి చుట్టుకున్నది రెండుబారల గుడ్డ. అదంతా తడిసి ఒంటికి అంటుకుపోయింది. తడిపిన చెంగు ఎండలో ఆరబెట్టి తనూ ఎండలో కూర్చుంది.

ఎండ నిప్పులు చెరుగుతోంది. అంత ఎండలో కూర్చున్న మనిషి మలమలా మాడిపోవాల్సిందే.

"నీ సంచిలో ఇంకో చీర లేదూ?" రాధ వరండాలో నిలబడి అడిగింది.

"లేదమ్మా! రెండే కోకలుండేయి. పురుడయ్యాక చిరిగిపోయాయి. ఫర్వాలేదులేమ్మా! అదే ఎండిపోతది."

రాధ లోపలికివెళ్ళి పాతగుడ్డల పెట్టె తీసింది. చిరుగుపట్టిన చీరెలు రెండు ఉన్నాయి. తెల్లంచు నల్లచీర బయటికి తీసికెళ్ళింది — ఎండలో కూర్చున్న మనిషి దగ్గిరికి గిరాటు పెడుతూ– "ఈ చీర కట్టుకో. ఆ గుడ్డ విప్పేసి ఎండలో పడేసి యిలా రా! కొంచెం అన్నంవుంది, తింటావా?"

"మీ దయ తల్లీ!"

"తెల్లంచు నల్లచీర కట్టుకుంటే ఆ మనిషి కెంతో కళ వచ్చింది. పెన్నిధి దొరికినంత తృప్తి కనిపించింది మొహంలో.

అన్నం, పప్పూ ఓ విస్తరాకులోపెట్టి తీసుకొచ్చింది రాధ.

నాలుగు ముద్దల్లో తినేసిందా మనిషి. విస్తరాకు పారేసి వచ్చి చేతులు కడుక్కుంది.

"అమ్మా! కాస్సేపిక్కడ నడుం వాలుస్తాను. పిల్లోడు లేచాక తీసుకుపోతాను."

"అలాగే పడుకో. ఆ సంచి తలకింద పెట్టుకో. అన్నట్టు నీ పేరేమిటి?"

"కన్నమ్మండి!"

"కన్నమ్మా?" రాధ ఆశ్చర్యపడింది - కన్నమ్మవి నువ్వేనా?" రెట్టించింది.

కన్నమ్మ లేచి కూర్చుంది.

"పడుకో, పడుకో. ఊరికే అడిగాన్లె." రాధ లేచి లోపలికి వచ్చేసింది. పడుకుంటే నిద్ర పట్టలేదు.

పది నిమిషాల్లో వెళ్ళి చూసేసరికి తల్లీ పిల్లాడు స్పృహతప్పి పడివున్న వాళ్ళలా నిద్రపోతున్నారు.

ఈ కన్నమ్మని అప్పలమ్మ తిట్టనిరోజు లేదు. చెడ్డముండట. ఏవిటా చెడ్డ?

మూడుగంటలవేళ కన్నమ్మకి మెలకువ వచ్చింది. రాధ అంట గిన్నెలన్నీ వాకిట్లోవేసి — "అప్పలమ్మ ఇంకా రాలేదు. మళ్లా దీనికే మె దో! అబ్బబ్బ ప్రాణాలు తీసేస్తుంది. ఎప్పుడు విరగడౌతుందో తెలిసేలాలేదు. చిరాకుపడుతూ బియ్యం ఏరటానికి కూర్చుంది. కన్నమ్మ వూడిపోయిన జుట్టు దులిపి ముడేసుకుంటూ —"నేను కడిగిపెడతాలేమ్మా గిన్నెలు" అంటూ లేచింది.

ఆపూట అప్పలమ్మ రానేలేదు. పనంతా కన్నమ్మే చేసింది. అంట్ల గిన్నెలు అద్దాల్లా తోమింది. ఇడ్లీపప్పు కాటుకలా రుబ్బింది. గదులన్నీ సుబ్బరంగా తుడిచింది. మధ్యాహ్నం రాధ విప్పిన బట్టలు వుతికి ఆర వేసింది.

పిల్లాడు రెండోసారి పాలుతాగి హాయిగా పడుకున్నాడు.

రాధ మనస్సు ఎంతో తేలిగ్గావుంది.

కన్నమ్మలాంటి పనిమనిషివుంటే బావుండును. వేడి వేడి ఉప్మా కొంచెం ఆకులోపెట్టి కన్నమ్మ కిచ్చింది.

పిల్లలు ముగ్గురూ బళ్ళోంచి వచ్చి వరండాలో పడుకున్న పిల్లాడి చుట్టూ చేరారు. వాళ్ళ ప్రశ్నలకి జవాబులు చెప్పేసరికి నీరసం వచ్చింది రాధకి.

"పాపాయి పేరేంటమ్మా?"

"నాకూ తెలీదు వాళ్ళమ్మ నడగండి" అంది రాధ విసుక్కుంటూ. కన్నమ్మ నవ్వి—"ఎంకడు బాబూ! తిరపతెంకన్న పేరు" అనిచెప్పింది పిల్లలకి— వాళ్ళతో కబుర్లాడుతూ ఓ అరగంట కూర్చుంది. తర్వాత లేచి పిల్లాణ్ణి భుజంమీదేసుకొని సంచి చేతితో పట్టుకుంది–"ఎళ్తానమ్మా!"

"ఎక్కడికి ?" అప్రయత్నంగా అడిగింది రాధ. తమాయించుకుంటూ—"అన్నట్టు మీ యిల్లెక్కడా? అసలెక్కడుంటున్నావూ?" అంది దీర్ఘం తీస్తూ.

"ఎక్కడా లేదమ్మా! ఏ పూట కేతల్లి కి దయకలిగితే ఆరింటో."

"అసలు మీ దే వూరు ?"

"ఈ ఊరు కాదమ్మా! శానా....దూరం లెండి."

"ఈ పిల్లాడి బాబెక్కడున్నాడు ?"

కన్నమ్మ జవాబు చెప్పలేదు. అంతవరకూ చెప్పిన జవాబులు కూడా ఇష్టంలేనట్టుగానే చెప్పింది.

"నువ్వేనా పొద్దున్న రైలుకింద పడిపోతానని నించున్నావుటా.... ఇంత చంటిగుడ్డును పెట్టుకుని అదేంపని కన్నమ్మా?" కొంచెం మందలింపుగానే అంది రాధ.

కన్నమ్మ కళ్ళల్లో నీళ్ళూరాయి – "బతకలేనోళ్ళు చావకేం చేస్తారమ్మా ?"

"అయితేమాత్రం? నాలుగిళ్ళలో పని చేసుకునైనా బతకొచ్చు. నీకేం లోటు?"

"కనికరించి ఆ ముక్క మీరన్నారు. ఈ ఇళ్ళమద్దెన కొచ్చిన కాణ్ణించీ పిచ్చికుక్కని తరిమినట్టు తరిమెయ్యాలని చూస్తున్నారు. ఆ యమ్మో మాట, ఈ యమ్మోమాట. కష్టపడి బతుకుదామనే వచ్చాను. రోజు గడిచేలాగ లేదమ్మా! పేణం ఇసిగిపోతుంది."

"సరేలే. ఈపూట కింకెక్కడికి కెళ్తావు? రేపు చూద్దాం. పిల్లాడిని పడుకోబెట్టు. చూడు, ఆ తెల్లగిన్నె నిండా నీళ్ళుపట్టి తీసుకురా! ఎసరు పడేస్తాను" రాధ వంటింట్లో కెళ్ళింది.

కన్నమ్మ నంచి కింద పెట్టి పిల్లాణ్ణి పడుకోబెట్టింది — పిల్లలు ఎంకడిచుట్టూ చేరారు.

—రాత్రి భర్త వచ్చాక కన్నమ్మ గురించి చెపుతూ— పాపం.... ఎవ్వరూ లేరట మనిషి మంచిదిలావుంది. పనులన్నీ శుభ్రంగా చేస్తోంది. ఈ పనిమనుషులో నా ప్రాణం విసిగిపోతోంది. అప్పలమ్మ నెలకి పది సార్లయినా నాగాలు పెడుతుంది. సరికదా ఏపని చెయ్యమన్నా పుట్టెడు కోపం. పొద్దుటే చూడండి టిఫిన్లూ, కాఫీలు మీకు ఆఫీసూ—పిల్లలకి స్కూలూ .... అన్నీ తరుముకుంటూ వస్తాయి." ఎడతెరిపి లేకుండా మాట్లాడుతోన్న రాధ వాగ్ధాటికి అడ్డుపడుతూ — "అబ్బబ్బ! ఎందుకీ దండకం రాధా? అసలు కబురేమిటో చెప్పు!" అన్నాడు సత్యనారాయణ.

"ఏంలేదు. కన్నమ్మని మనింట్లో వుంచుకుందామా?"

"నీ ఇష్టం. పనిమనిషి కావాలంటే వుంచుకో."

"దానికి కొంచెం దిక్కు చూపించినట్టూ వుంటుంది. బొత్తిగా చంటిపిల్లాడితో యిల్లిల్లూ తిరుగుతోంది. అందుకనీ...."

"అలాగే. ఇందులో మనకి తరిగిపోయేదేమిలేదు. ఇంట్లో మనిషి ఉంటే నీకు చాలా సాయంగా వుంటుంది. అన్నీ ముందు చెప్పి జాగ్రత్తగా వుండమనిచెప్పు"— సత్యన్నారాయణ భోంచేసి గదిలోకి వెళ్ళిపోయాడు. రాధ పొంగిపోయింది.

కన్నమ్మకి అన్నం పెడుతూ నవ్వుతూ అంది—

"కన్నమ్మా! నీ కెక్కడా ఇల్లూ వాకిలీ లేదన్నావు. పోనీ మా ఇంట్లో వుండిపోరాదూ!"

కన్నమ్మ తలెత్తి అమితాశ్చర్యంగా చూసింది.

"కన్నమ్మా! ఈ లక్షరూపాయల మూట అందుకోరాదూ?" అంటే ఎలా వుంటుంది?

"అదేవిటి? మాట్లాడవేం?" అంది రాధ.

కన్నమ్మ ఆనందంతో దుఃఖం వస్తోంది — "అమ్మా! దేవుడే నన్ను మీగడపలోకి తెచ్చిపడేశాడు. ఈ అన్నంమీద ప్రమాణం. ఇస్వాసంగా మసలుకుంటాను. మీ మేలు మర్చిపోనమ్మా! నా బిడ్డ సాక్షీ.

"ఛ! ఏమిటా ఒట్లు? కష్టపడేవాళ్ళకి ఏదో ఒకదారి దొరుకుతుంది. దానికేం భాగ్యం?.... పిల్లాడికి పాలు ఈ చెంబుతో వుంచుతాను. నీకింకా అన్నం కావాలా ?"

"ఒద్దమ్మా! కడుపు నిండిపోయింది."

రాధ గదిలోకెళ్ళి కన్నమ్మ పడుకోటానికో చాపా, పాత దుప్పటి తెచ్చి ఇచ్చింది. వంటగది సర్దుకుని, పిల్లాడికి పాలు పట్టమని కన్నమ్మని హెచ్చరించి పడుకోటానికి వెళ్ళిపోయింది.

—మర్నాడు చీకట్నె అప్పలమ్మ దబదబా తలుపులు బాదుతోంటే అంట్లు తోముతోన్న కన్నమ్మ లేచివెళ్ళి తలుపులు తీసింది.

దెయ్యాన్ని చూచినట్టు బెదిరింది అప్పలమ్మ.

రాధ గుమ్మం దగ్గిరికొసూ — "అప్పలమ్మా! నీకు ఖాళీలేదని-మనిషిని చూచుకోమనీ చెపుతోనే వున్నావుగా? కన్నమ్మని కుదుర్చుకున్నాను. తర్వాత మీ అబ్బాయిని పంపించు. డబ్బులుచూచి ఇచ్చేస్తాను" అంది.

"అదేంటమ్మా! ఒక్కపూట రాలేదని.... నా చేతిలోపని ఆ ముండకిస్తావా ?"

"చీకట్నే ఎందుకా కేకలు? నేను రమ్మంటే వచ్చి పనిచేస్తోంది. దాన్నెందుకు తిడతావు?... రోజుకోపూట ఎగ్గొడతావు. నీతో నా కెలా కుదురుతుంది? చాలుగాని వెళ్ళు."

"ఎళాలేమ్మా! నా నోటిదగ్గర కూడు లాక్కుని ఆ ముండెన్నాళ్లు తింటదో తినమను. దాని జిమ్మడా! దానికి పొయ్యేకాలంరానూ! దాని బిడ్డ బూడిదవ్వా." రాధ తలుపులు వేసేసి మొహం కడుక్కోటాని కెళ్ళిపోయింది. అప్పలమ్మ రంకెలు వినపడుతోనే వున్నాయి కన్నమ్మకి.

• • •

కన్నమ్మ వచ్చి వారం దాటింది.

గదులు తుడుస్తూ దొరికిన డబ్బులు తెచ్చి యిచ్చేసింది – రెండు మూడుసార్లు.

ఓసారి రాధ బాత్‌రూమ్‌లో చెవిదుద్దులు పర్చిపోతే జాగ్రత్తగా పట్టుకెళ్ళి యిచ్చింది — "అమ్మా! నా కర్మకాలి ఇయ్యేక్కడన్నాపోతే నామీదే వుంటది అనుమానం. కొంచెం జాగ్రత్తగా చూసుకోండమ్మా!" అంది భయపడుతూ.

ఆ వారం రోజులలోనూ కన్నమ్మ కథకూడా వింది రాధ. కన్నమ్మకి మొట్టమొదట ఒక పెళ్ళయింది. ఇద్దరు కొడుకులు కూడాను. ఐదారేళ్ళు మొగుడూ పెళ్లాలు సుఖంగా వున్నారు.

"నీ మొగుడు మంచివాడేనా?" అంది రాధ అడుతగిలి.

"కోపంవస్తే చితకబాదేవోడుగానీ చాలా మంచోడమ్మా!"

"అంత కోపం ఎందుకు వచ్చేదీ? వస్తేమాత్రం...."

"పోనీలేమ్మా! కట్టుకున్నాడో – ఏంచేసినా ఆడికే చెల్లు – అదే వుంటే నాకి తిప్పలెందుకు తల్లీ?"

కన్నమ్మ మొగుడు ఏదో జబ్బుచేసి చచ్చిపోయాడు. పిల్లలిద్దర్ని పెట్టుకుని పుట్టింట్లోనే వుండేది కన్నమ్మ రెండేళ్ళవరకూ. తల్లీ తండ్రీ లేరు. అన్నా, వదినా వున్నారు. ఆ వదిన వాతలుమాత్రం పెట్టలేదు. కానీ నానాపాట్లూ పెట్టింది. కన్నమ్మకి కడుపునిండా తిండి పెట్టేదికాదు. పెట్టడానికి మాత్రం తిండెక్కడుంది? పోనీ మాటైనా చల్లగా మాట్లాడేది కాదు.

ఓరోజు కన్నమ్మ అన్న ఒక సంబంధం తీసుకొచ్చాడు. కన్నమ్మకి మళ్ళీ పెళ్ళిచేసుకోవాలని లేదు. కాని ఎవణ్నో ఒకణ్ని కట్టుకోకపోతే ఈ వదినగా రెన్నాళ్ళో బతకనివ్వదు. అయినా అన్న తెచ్చిన సంబంధం మాత్రం కన్నమ్మకి బొత్తిగా యిష్టంలేదు. అరవయ్యేళ్ళు దాటిన వాడిని కట్టుకునేకన్నా – వయస్సులోవున్న అప్పన్ననే చేసుకోవచ్చుగా?

అప్పన్న కన్నమ్మావాళ్ళకి దూరపు చుట్టం. మొదటి పెళ్లాం పోయింది. పిల్లల్లేరు. కన్నమ్మతో చాలాసార్లు పరాచికాలాడబోయాడు. కన్నమ్మ విసిరికొట్టింది. అయినా వెంటబడి తిరుగుతోనే వున్నాడు.

"నేను అప్పన్ననే చేసుకుంటాను" అంది కన్నమ్మ. వాళ్ళన్నకి చాలా కోపం వచ్చింది. తిట్టిపోశాడు. కన్నమ్మ ఒకరాత్రి పిల్లల్ని వది లేసి అప్పన్న ఇంటికి వెళ్ళిపోయింది. అప్పన్నకి తల్లీ తండ్రీ ఉన్నారు. కన్నమ్మ రావటం వాళ్ళకి ఇష్టమే. గప్‌చిప్‌గా అప్పన్నకి – కన్నమ్మకి గుళ్ళో పెళ్ళి చేసేశారు.

"నేను చేసిన బుద్ధితక్కువపని అదేనమ్మా!" అంది కన్నమ్మ పశ్చాత్తాపపడుతూ. "ముసిలోడో – ముతకోడో – మా అన్న చెప్పిన పెళ్ళి చేసుకుంటే నా బతుకు రాజమార్గంలాగ ఎళ్ళిపోయేది. నా కష్టసుఖా లకి మా అన్నే ఆదుకునేవోడు. దొంగపెళ్ళి చేసుకునేటప్పుడు పిసరంత గ్నేనంకూడా లేకపోయింది నాకు."

"ఇప్పుడలా అనిపిస్తుందిగాని ఆ పరిస్థితుల్లో ఎవ్వరైనా అలాగే చేస్తారు కన్నమ్మా! ఆ ముసిలాడిని చేసుకుంటే అప్పుడెలా వుండేదో నీంకే తెలుసు?" అంది రాధ సానుభూతిగా.

"అవునమ్మా! అప్పన్నతో పెళ్ళయిపోయాక నిమ్మళంగా మా అన్న కోపం పోతుందనుకున్నాను. పిల్లల్ని తెచ్చేసుకుందామనుకున్నాను. ఒక నెలరోజులు పోయాక "పిల్లలకోసం ఎళ్తాంరా!" అంటే అప్పన్నే వన్నాడో తెలుసామ్మా? — "పిల్లలూ వొద్దు, పీసూ వద్దు. ఆళ్ళనెవరు మేపుతారు? తిండిదండగ" అని కసిరికొట్టాడు. నేను కాళ్ళా ఏళ్ళాపడి ఏడిచాను. పిల్లల్ని చూడకపోతే వుండలేనని తిండి మానేసి పడుకున్నాను. "అయితే ఒకసారెళ్ళి చూసిరా!" అన్నాడు. ఎంటబెట్టుకు వచ్చేద్దామని ఒక సందేళ బయల్దేరి మా అన్నింటి కెళ్ళానమ్మా! ఇలా గడపలో కాలెట్టానో లేదో పిల్లలిద్దరూ నన్ను చూసి అన్నం గిన్నెలు వొదిలేసి బావురుమంటూ కాళ్ళకి చుట్టేసుకున్నారు. దుఃఖం ఆగక వలవలా ఏడ్చే శాను. లోపల్నించి యముళ్ళా వచ్చాడు మా అన్న. పిల్లలిద్దర్నీ చెరొక

రెక్క పట్టుకుని ఈడ్చుకుపోయాడు — నోటికిరాని బూతులు పేలాడు. గడపలోంచి ఈధిలోకి గెంటేశాడు నన్ను. ఎప్పుడేనా గుమ్మంలో అడుగెడితే కత్తికొక్క కండలా నరికేస్తానన్నాడు. పిల్లల్ని తెచ్చుకుందామంటే ఈ డొప్పుకోడు. ఇమ్మంటే ఆడివ్వడు. నేనేం చెయ్యనమ్మా !"

"పోనీలే. నీ అన్నదగ్గర సుఖంగానే వున్నారుగా? నువ్వు తీసుకొస్తేమాత్రం అంతకన్నా ఏం పెట్టెస్తావు?"

"అందుకే నేనూ గుండె రాయిచేసుకుని వూరుకున్నానమ్మా ? ఒక్కేడాది ఎలాగో గడిచింది. అప్పన్న రిక్షాబండి లాగేవోడు. తాగుడు బాగా నేర్చేసుకున్నాడు. నెత్తీ నోరూ బాదుకున్నాను. యిన్నాడుకాదు. రేత్తుళ్లు యింటికి వొచ్చేవాడుకాదు. ఆడికర్మ ఆడిదని వొదిలేశాను.

ఒకనాడు మా అత్త వూళ్ళోలేదు. అప్పన్న ఇంటికి రాలేదు. మా మావఁ అర్ధరాత్రి నా పక్కలోకొచ్చి కూకున్నాడు. కంగారెత్తిపోయాను. ఈధిలోకి పరిగెత్తాను. తెల్లార్లు గుమ్మంముందే పడుకున్నాను.

"చీకట్నే వచ్చాడు అప్పన్న...."

"వాడికి చెప్పెయ్య పోయావా?" రాధ.

"చెప్పేశానమ్మా! మీ అయ్య ఇలాచేశాడు—" అని ఏడ్చేశాను. "ఏడిశావులే. మా అయ్య మంచోడు" అని తూలుకుంటూ లోపలికి పోయాడు. మిట్టమధ్యాన్నందాకా బండలా పడుకుని నిద్దరోయాడు. లెగిసేసరికి మా మావఁ ఐదురూపాయల నోటు అందించాడు కొడుక్కి. మా మావఁకి సారా కొట్టుంది. బాగా సంపాదించేవోడు. అ సమానూ కొడుక్కి డబ్బిచ్చేవోడు. తరువాత ఒక వారం రోజులు నా వూసురాలేదు. మళ్లా ఆడికేం బుద్ధిపుట్టిందో— ఇంట్లో నా మొగుడూ వున్నాడు. మా అత్తా ఉంది. మళ్లావచ్చి నా దగ్గిర కూచున్నాడు. గుసగుస లాడటం మొదలెట్టాడు. నేను బెదిరిపోయి ఎర్రికేక లేసేశాను. నా నోరు నొక్కేశాడు. ఏడవటం మొదలెట్టాను. నా మొగుడు లెగిసిరాడే! తెగతాగి పడివున్నాడు. మా అత్త సరేసరి. అది తెలిసే వూరుకుంది.

"నోరుముయ్యే ముండా! ఎదవగోలా నువ్వూనూ" అని ఒక్క కసురు కసిరింది పైగా.

"నా మాటిను. ఆ జులాయి ఎదవని నమ్ముకుని ఏం బావుకుంటావు?" అని బతిమాలటం మొదలెట్టాడు మా మావఁ.

"నేను దెయ్యంలా కూర్చున్నా. నా కేపీ తెలపఁలేదు. ఏడుపు కూడా రాలేదు."

రాధ ఆసక్తిగా వింటోంది కన్నమ్మ కబుర్లు—

"మీ అత్తకూడా ఎందుకిలా చేసింది?"

"తరువాత తెలిసిందమ్మా నాకు. అది దాని కిష్టమైన వోళ్ళతో పోయేది మొగుడు చూసీ చూడనట్టూరుకుంటాడు."

"చాలా విచిత్రంగా వుందే" రాధ ఆశ్చర్యపడింది. కన్నమ్మ కొంచెం నొచ్చుకుంటూ—"ఎందుకమ్మా? ఇలాంటి కబుర్లు మీలాంటోరు ఇనకూడదు పాపిస్టి బతుకులు మాయి."

"అబ్బే! ఫర్వాలేదు చెప్పు. అందరూ ఒక్కలా వుంటారా? ఎవరి ఇష్టం వారిది. నీ అత్తా మావా బాగానే వున్నారు. మధ్య నువ్వు నాశనం అయ్యావు. నీ మొగుడి కెలా బుద్ధిలేదూ?"

"ఆడికి బాబు నెదిరించే ధయిర్యం లేదమ్మా! ఏదో వంకపెట్టి నన్ను చావబాదుతోండేవోడు. తాగినప్పుడు దగ్గిరికొచ్చేవోడు. తెలివిగా వుంటే ఇసిరికొట్టేవాడు. మా మావకి మరీ అలుసైపోయింది."

"కన్నమ్మా! అలాంటి నరకం ఎలా భరించావు నువ్వు? అసలు నీ మొగుడూ నువ్వూ వేరే కాపరం పెట్టుకుని నిక్షేపంలా ఉండచ్చుగా?"

"అలాగే చెప్పానమ్మా! ఆడి చెవి కెక్కలేదు. ఇంటి కొచ్చేసరికి కక్కా ముక్కా వుడకేసి పెట్టేది అమ్మ. అర్థో, రూపాయో ఇచ్చేవాడు బాబు. ఉప్పు తేవాలని లేదు. పప్పు తేవాలనిలేదు. పెళ్లాంముండ ఉండనే వుంది పక్కలోకి. ఏబ్రాసిగా తిని తిరిగేవోణ్ణి వేరే సంసారం పెట్టమంటే ఇంటాడా? ఆడి అనూ పానూ తెలవకుండా ఆణ్ణి కట్టుకోటం, నా వొళ్ళు

పొగరు. రామలక్ష్మణు లాంటి బిడ్డల్ని పొదులుకున్నాను. నా పాపం నేను అనుభవించొద్దా అమ్మా?"

"అన్నట్లు పిల్లల్ని ఎప్పుడయినా చూస్తూ వుండేదానివా?"

"నెల్లాళ్ళకో - రెన్నెల్లకో — ఏ బజార్లోనో తారసపడేవోరు. అ స్తమానం కనపడితే బెంగ పెట్టుకుని ఏడుస్తారని నేనే తప్పుకునే దాన్ని. ఆళ్ళిద్దరూ మా అన్న దగ్గిర బాగానే వున్నారు.

ఈ మూడో పిల్లోడు కడుపులో వడ్డాకేనమ్మా నా బతుకు బజారు కెక్కింది. ఈ కబురు చెప్పబోతే చీదరించుకున్నాడు నా మొగుడు.

"కడుపొచ్చిందిట, కడుపొచ్చిందిట. కడుపు. నీకూ నాకూ ఏం సమ్మంధం? ఎవడి దగ్గరికి పోతవో పో." అన్నాడు.

ఆ మాటల్తో మా మావకి కోపంవచ్చింది. "ఏంట్రా పేల్తున్నవ్? దాన్ని కట్టుకున్నది నువ్వా? నేనా?" అన్నాడు బుజాలు తడుముకుంటూ.

"అది నీకే తెలవాలి" అని కస్సుమన్నాడు కొడుకు. ఇద్దరూ మాటామాటా అనుకుని—కలబడి తన్నుకోబోయారు. ఆళ్ళూ, ఈళ్ళూ వొచ్చి విడదీశారు. ఆ రేత్రికి రేత్రి ఇంట్లోంచి ఎళ్ళిపోయాడు నా మొగుడు. ఒక నెల్లాళ్ళయినా తిరిగిరాలా. మా అత్తకి నేను ఇంట్లో వుండటం ఇష్టంలేదు. "ఇంకా ఇక్కడే మొగుడున్నాడని కూర్చున్నావే?" అని తిట్టిపోసేది. ఆ ఇంట్లొ వుండటం నా కిష్టంలేనేలేదు. ఇంకెక్కడి కెళ్ళను? దారీ తెన్నూ లేదు.

మా అత్త ఒకరోజు మా మావా నేనూ గదిలో వుండగా బయట గొళ్లెం పెట్టి పదిమందినీ కేకలేసి — రెండు చేతుల్తోటీ జుట్టు పీక్కుని ఏడుస్తూ — "చూశారా? చూశారా? ఈ ముండ....నా మొగుణ్ణి ఇంత కన్నాయం ఎక్కడేనా ఉందా? .... మీరన్నా బుద్ధిచెప్పండి" అంటూ అరవటం మొదలెట్టింది.

అందరూ నన్ను పురుగుని చూచినట్లు చూశారు — "నీ కేం పొయ్యేకాలం? కళ్ళుపోతాయే" అన్నారు. తలోమూలా దుయ్యబట్టేశారు.

"నా ఇంట్లో ఉంటానికి ఈల్లేదు. ఎక్కడికి పోతావో పో" అని మా అత్త నా కొప్పట్టుకుని బయటికి గెంటి కోకలుతెచ్చి మీద పడేసింది.

నే నక్కడే కూలబడ్డాను. ఎవరి దార్ని ఆళ్ళు పోయారు.

"మళ్లా మీ అన్న దగ్గరకే వెళ్ళలేకపోయావా?"

"ఎళ్ళానమ్మా! నా కింకెవరున్నారు? ఆడు నన్ను చంపేసినా మంచిదే అని ఎళ్లాను — ముందు నా గుమ్మందిగి నించోమన్నాడు."

"అబ్బ! అంత కఠినంగా ఎవరయినా ఉంటారా? మనిషికి జాలి, దయా ఉండక్కర్లేదా?"

"నాకు నిజం మీ కబద్దం. మా అన్నలాంటి కర్కోటకు డెక్కడా ఉండడు. నన్ను ఇంట్లోకి రానిచ్చి, పీకపిసికి చంపేసినా బాగుండు నమ్మా!"

"తర్వాత ఎక్కడికెళ్ళావు?"

"గంగమ్మ అని ఒకావిడ ఆళ్ళింటికి రమ్మని చేరదీసింది. గంగమ్మకి పిల్లల్లేరమ్మా! ఎప్పుడో రెండు కడుపులొచ్చి పోయినాయంట. తరవాత మనిషి ఊరిపోయింది. బండలాగ వుంది. పిల్లలు పుట్టరని డాక్టర్లు కూడా చెప్పినారంట....అందుకని మొదట్లో నన్ను కనికరించి చేరదీసినా తర్వా తర్వాత నాకు పుట్టే పిల్లనో, పిల్లణ్నో తను పెంచుకోవాలని ఆలోచించుకుంది. నన్నూ ఆడిగింది — "అంతకంటేనా? నేనుమాత్రం ఏం పెట్టి పెంచుతానూ," అలాగే తీసుకో" అన్నాను.

అప్పట్నించీ ఆ మొగుడూ పెళ్లాం నన్ను బాగానే చూసేవోళ్ళు. ముందు నాకు కూడెట్టేది. బజార్నుంచేదో వొకటి తెచ్చిపెట్టేది. అక్కడ చీపురుపుల్లెక్కడ పెట్టనిచ్చేదికాదు. కన్నబిడ్డని చూసినట్టు చూసింది — గంగమ్మ మొగుణ్ణి—"అన్నా!" అని పిల్చేదాన్ని. ఆడుకూడా "చెల్లెమ్మా" అనేవోడు. భగవంతుడు నన్ను సల్లగా చూశాడనుకున్నాను.

కన్నమ్మ చెప్తూనేవుంది. రాధ ఆలోచనల్లో మునిగింది – కన్నమ్మ చెప్పకుండానే తర్వాతేవయిందో తెలుసుకోవాలని. ఎవళ్ళో చేరదీశారం టోంది. ఈ పిల్లాడేవిటి? ఈ వీధులట్టుకు తిరగటం ఏమిటి?

"పిల్లాణ్ణి గంగమ్మ కివ్వలేదా?" అంది గబుక్కున. కన్నమ్మ ఎందుకో దిగాలు పడిపోయి వూరుకుంది. "అమ్మా! ఏంటి సెప్పమంటారు? నాకు నిజం, మీ కబద్ధం. ఇల్లుదాటి బయటికెళ్ళిన ఆడదంటే గుడ్డ విప్పుకుని బజార్లో తిరిగే దాన్తో సమానం, అది మంచి ముండా? చెడ్డ ముండా? అని చూడదు. రాంబందు పీక్కుతిన్నట్టు పీక్కుతినాలని ఎగబడతారు.

కడుపుతో ఉంటే మాత్రం కాళ్ళు చాపుక్కూర్చుంటే జరుగుద్దా అని ఏదో ఒక పనిలో కెళ్ళేదాన్ని. అమ్మా! ఈ ప్రెపంచకంలో నాలాంటి ఆడముండ కెక్కడ దిక్కుంది? నే నేటంత అందగత్తెనా? మిడిసిపడి పోతన్నానా? అసలు మొగోళ్ళకి అందవూ అక్కర్లేదు. చందవూ అక్కర్లేదమ్మా! ఎవతో ఒకతి ఆడది కావాలి. కూలిపనిలోకెలితే యజమానులు–తాపీ పనిలో కెలితే మేస్త్రీలు– పొలంపనిలోకెలితే కావందులు – ఇక్కడేంటి–అక్కడేంటి —ఈళ్ళేంటి ఆళ్లేంటమ్మా .... మొగోడి అండలేని ఆడది ఎవడికో ఒకడికి తలొంచాలిగానీ– లేకపోతే బతకలేదు. పిచ్చి కుక్కని తరిమినట్టు తరిమికొడతారు — ఒక్కమాటినమ్మా! అన్నా! అన్నా! అని పిల్చేదాన్ని. "ఏంటీ చెల్లెమ్మా!" అనేవోడు– అలాంటోడు గంగమ్మ మొగుడేం చేశాడో తెలుసా అమ్మా? పురుడొచ్చేదాకా ఊరుకున్నాడు. బాగానే పుట్టాడు పిల్లోడు. గంగమ్మ ఆణ్ణి మురిపెంగా చూసుకుంటూ వుంది.

నెల్లాటిందోలేదో ఒకనాడు గంగమ్మ ఎక్కడికో ఎళ్ళింది. సందాలగ్గాని రానని చెప్పింది. నే నొంటిగా వుండాను. పిల్లాడికి నీళ్ళోసాను. ఆణ్ణి పక్కలో ఏసుకుని పడుకున్నాను. కునుకట్టింది. మెలుకువవొచ్చి చూద్దును గదా .... ఆడు .... జుట్టుమీద చెయ్యేసి తలదగ్గర కూచుని నవ్వుతున్నాడు.

నా వొళ్ళు జల్లుమంది– "ఇదేంట్రా అన్నా?" అంటూనే కంగారుపడి లేసిపోయాను. ఆడింకా దగ్గిరికొచ్చాడు. "అది రాదులేయే! ఏంటి భయం?" అన్నాడు. నాకంతా అర్థమయిపోయింది.

పుట్టెడు దుఃఖం వొచ్చేసింది. "అన్నా! అన్నవనుకుంటున్నా(నా! నా కళ్ళు పోతాయిరా!"

"ఓస్! కళ్ళెందుకు పోతాయే; ఒకమ్మకి పుట్టామా? ఒకబ్బకి పుట్టామా? పిలుచుకుంటేనే తోడబుట్టినోళ్ళం అయిపోతామేంటే?" అన్నాడు. నేను ఏడుస్తా కూచున్నాను.

ఆడి హుంషారంతా పోయింది. నామీద కోపం వొచ్చింది. "ఏంటే కన్నమ్మా! సీతమ్మోరిలా మాట్టాడతావేంటే? నీ మావకన్నా తీసిపోయానేంటే?" అన్నాడు. ఎటకారం చేశాడు. నే నొప్పుకోలా. దగ్గర కూచుని నెమ్మదిగా నాకు నచ్చచెప్పాలని చూశాడు. "నా దగ్గిరుంటే నీకేవీ లోటుండదే! కూడూ-గుడ్డా పూచీ నాది. నా మాటినే. తప్పులేదే! నీకుమాత్రం వయిసు లేదా? ఉప్పూ కారం తింటంలేదా? మారు మనువు కులపోళ్ళం మనం. ఎవడు కాదంటాడే?"

"అన్నా! నీకు దణ్ణం పెడతాను, నా వూసెత్తకు. మీరే తల్లీదండ్రీ అనుకుని మీ పంచన పడున్నాను. నీ కన్నకూతుర్ననుకో. నీ అప్ప చెల్లెల్ననుకో. నీ కాళ్ళకి దణ్ణం పెడతాను. నా బిడ్డ ముఖంచూడు...." బావురుమని ఏడుస్తూనే— ఆడి కాళ్ళట్టుకున్నాను.

ఇసురుగా ఇదిలించుకుని బయటికి పోయాడు. కుప్పలా కూలి కుమిలిపోయాను.

సందాలకే గంగమ్మొచ్చింది. "గంగప్పా!" అని దాన్ని చుట్టబెట్టుకుని ఎడ్చేద్దావనుకున్నాను. "ఏంపైంది కన్నా?" అని అదడిగితే ఏం చెప్పాల? ఆళ్ళిద్దరూ కుమ్ములాడుకుంటారు. తెలిసో తెలవకో వాగాడు ఎధవ. పోన్లే ఆడి పాపం ఆడిదే. ఆళ్ళ కాపరంలో నేనెందుకు చిచ్చుపెట్టాల? ఆడు సేసిన తప్పు అడే తెలుసుకుంటాడు—" అని నాలో నేను సవర్ధించుకున్నాను.

"ఏంటే కన్నమ్మా అలాగున్నావ్?" అంటే "ఏంటీ లేదే! నిద్దరోయాను" అన్నాను. "నీ మొకం సంతకెల్లా! నీకేం పొయ్యేకాలమే.

పచ్చి బాలెంతరాలివి. పట్టపగలు నిద్దరోతావా? వాతం కమ్ముకొస్తే ఏం టవుతావే?" అంటూ కూకలేసింది.

అంత మంచిమనిషి గంగమ్మ. దాని కడుపులోది తీసి నా కడుపులో పెడతది. నా పిల్లోణ్ణి చూసుకుని నాకన్నా ఎక్కువ అదే మురిసిపోతది.

"అమ్మా! అలాంటిదానికి నామీద కోపంవచ్చి తన్ని తగిలేసిం దంటే నా రాత కాకపోతే మరేంటి?" — కన్నమ్మ చెప్తోదంతా రాధకి కొత్త ప్రపంచంలా వుంది పనిపాటలు చేసుకుంటూ బతికే తక్కువ స్థాయి వాళ్ళంతా ఇష్టంవచ్చినట్టు తిరుగుతారనీ—వాళ్ళకి గుణం గుట్టూ వుండవనీ ఎందుకో అలా అనుకునేటి రాధ—కాని.... ఈ కన్నమ్మ?

"గంగమ్మ కెందుకు కోపం వచ్చిందీ?" అంది ఆసక్తిగా.

"దాని కేంటిలేమ్మా! ఎవళ్ళకయినా కోపం వస్తది. అసలు తప్పు నాది. నా మనసులో ముక్క దాని చెవులో వూదేశాను కాను. ఆముక్కే అదీ అడిగింది–"నువ్వంత ఇల్లాలివైతే మొదట్లోనే నా కెందుకు చెప్ప లేదూ?" అని నిలదీసడిగేసింది. నేను చెప్పకపోవటమే ఆడికి లోకువై పోయింది. నా కిష్టం ఉండే బెట్టు చేస్తున్నాననుకున్నాడు. చూడమ్మా! ఎలా గొచ్చిందో నా కత."

"అయ్యో! పిచ్చిముండా!" అనుకుంది రాధ.

"వాడు మళ్ళా ఏవైనా అన్నాడా?" అంది పైకి.

"మల్లా ఏంటమ్మా? నించోనిచ్చాడా? కూకోనిచ్చాడా? గంగప్ప కనుమరుగైతే చాలు. నా కొంగట్టుకు లాగేవోడు. చెయ్యట్టుకు గిల్లేవోడు. ఏంచెయ్యాలో తోచేదికాదు. గంగప్ప చూస్తాదని భయం. మీ కబద్ధం. నాకు నిజం. గుప్పిట్లో పేణాలెట్టుకూకున్నా ననుకోండి — పాపం ఎన్నాళ్ళు దాగుద్దమ్మా? భళ్ళున బద్దలవదా? ఒకనాడు .... సందేల .... చీకటి చీకటిగా వుంది. దొడ్లో బీరపాదు ఎనక్కెళ్లాను. దడిమీద పిల్లోడి గుడలారేశాను గాలికి. ఎనక్కితిరిగి చూద్దునుగదా ఈడు. అమాంతం కావిటేసుకున్నాడు. "ఇదిగోనే! రయికలగుడ్డ కొనుక్కోయే!" అంట్లూ రూపాయిబిళ్ళ నా గుప్పిట్లో పెట్టాడు.

దేవుడో! ఇదేం ప్రారబ్దంరో — నా కాళ్ళు గజగజ వొణికి పోయాయి. నోట్లోనుంచి మాట రాలేదు. పిచ్చిపట్టిన ముండలాగ నించున్నాను.... అదుగోనమ్మా! అప్పుడే .... చూసేసింది గంగమ్మ. ముందు తెల్లబోయింది. తరువాత వురిమి చూసింది. తల తాటించింది. గబగబా యింట్లో కెళ్ళిపోయింది దాన్ని చూడగానే వుండేలు చూసిన కాకిలా మాయమయ్యాడు ఎదవ. నే నొక్కదాన్నీ చిక్కిపోయాను — బిక్కచచ్చి నించున్నాను.

తోపలికెళ్ళిన గంగమ్మ పిల్లోణ్ణి తీసుకొచ్చి నా కళ్ళముందు మట్టిలో పడేసింది — "నాకు పిల్లొద్దు, పీసూ వొద్దూ తల్లీ! ఇలా బతకనియ్యి. నీ దారిన నువ్వు దయచెయ్యి" అనేసింది మండిపడిపోతూ.

"అప్పా!" అని దాని కాళ్ళమీద పడిపోయాను — "నామాట నమ్మే అప్పా! నేనే పాపం ఎరగనే! దేవుడితోడే! నే నెప్పుడూ ఒప్పుకోలేదే!" అని ఎంత చెప్పినా నమ్మదే !"

"ఛీ : ముండా! రంకునేర్చినదానివి బొంకనేరవ్వా? నీ లొసుగు లేకుండా ఆడు నిన్ను కావిటేసుకున్నాడా?.... ఎంత గుండెల్దీసిన బంటువే! ఇశ్వాసం వుందంటె నీకు? కన్నోళ్ళూ, కట్టుకున్నోళ్ళూ — తగిలేస్తే చేందీశానే ముండా! నా కడుపు కట్టుకొని నిన్ను మేపానే ముండా! కుక్క నీసుకొచ్చి సిమ్మాసనంమీద ఎక్కించానే ముండా! "చెల్లెమ్మా! చెల్లెమ్మా అని పిలిచేవాణ్ణి లొంగదీసుకుంటావా? కళ్ళు పేలిపోతాయే! కుష్టు రోగంతో కుళ్ళిపోతావే!...." అని ఒక్కమాట కాదు, ఒక తిట్టు కాదు. గుండెలు కరిగేలా రంకెలేస్తూ ఏం పేలిందో పేలింది.

మట్టిలో దొర్లుతూ పిల్లోడి ఏడుపు—గంగప్ప తిట్లు! — బొబ్బెట్టి పిలిచినట్టే మూగేశారు మూక—"ఏంటే గంగమ్మా?" అని పలకరింపులు. నా గుప్పిట్లో రూపాయి నా గుప్పిట్లోనే వుంది పారేస్తే నిజంగా తప్పుడుముండ నంటారని అలాగే పట్టుకున్నాను.

నాచెయ్యిలాగి రూపాయిబిళ్ళ అందరికీ చూపించేసింది గంగమ్మ— "చూడండర్రా, మీరందరూ బాగాచూడండి. ఇలా ఎన్నాళ్ళనుంచి సాగుతా

వుందో అడగండి, ఈ ముండకి నోటినిండా గడ్డెట్టండి" అని బుగ్గపోట్లు పొడిసింది.

"నా మాట ఇన్నవాళ్ళు వొక్కళ్ళూ లేరు. కాకుల్లా పొడిచేశారు."

"ఇంకా కొయ్యిలా నిలబడ్డావెందుకూ? దారిపట్టు" అంది గంగమ్మ చేతులు జాడిస్తూనే. నామీద నమ్మకం పోయిం తర్వాత దాని గడపలో రోజులెలా గడుపుకోను? మొగుడలాగ—పెళ్లామిలాగ.

"పిల్లోణ్ణి తీసేసుకో గంగప్పా! ఒక్కదాన్నీ ఎటో పోతాను" అన్నాను ధయిర్యం తెచ్చుకుని. ససేమిరా ఒప్పుకోలేదు. ఏడ్చాను. మొత్తుకున్నాను. ఒద్దుగాక వొద్దంది. అప్పుడాణ్ణి భుజంమీద పడేసుకుని పుట్టెడు చీకటి నెత్తినేసుకుని బయట్పడ్డాను. .... చేతిలో రూపాయి పురుగులా మెదిలింది. ఇసిరి పారేద్దా ననుకున్నాను — కళ్ళకద్దుకొనీ బొడ్లో దోపుకున్నాను .... "కన్నమ్మ కళ్ళలోంచి కన్నీళ్ళు బొటబొటా రాలిపడ్డాయి. చెప్పిన చరిత్రలోనూ సగం మాటలు ఏడుస్తూనే చెప్పింది. చెప్పలేక కొంత కొంతసేపు వూరుకుంటూ, వూరుకోలేక ఏడుస్తూ చెప్పింది.

రాధ వారించలేదు. ఏడవనిచ్చింది. ఏడవటంకూడా మానేస్తే ఇక దానికున్న దేవిటి?

పోనీలే కన్నమ్మా! జరిగిపోయింది తల్చుకుని ఎంతకాలం ఏడుస్తావు? కష్టాలు మనుష్యులకి రాకపోతే మానులకొస్తాయా? వూరుకో" అని ఓదార్చింది కొంత సేపటికి.

కన్నమ్మకూడా కొంత తేలిక పడింది — "అమ్మా! రెండు నెల్ల పొద్దయింది. బిడ్డని ఒళ్ళో పెట్టుకుని పక్షి తిరిగినట్టు తిరుగుతున్నాను. కడుపునిండా కూడులేదు. ఒంటినిండా గుడ్డ లేదు. రెక్కలకష్టం చేసుకుని బతుకుదావన్నా దారిలేదు. మొగోడి మొకం చూస్తే చాలు భయం పుడతా వుంది. ఆడ తల్లులికూడా కనికారంలేదు. మొహంమీద నవ్వినోళ్లేగానీ పన్నెత్తి పలకరించినోళ్ళు లేరు. "అమ్మా! నేనేనాడు పూజ చేశానో మీ గడప తొక్కాను. తిండీ—గుడ్డా దొరికింది. గుండె కుదట పడింది"

కన్నమ్మ చెప్పినదంతా వింటే రాధకో విషయం అంతుపట్లలేదు — అసలిన్ని బాధలెందుకు పడాలి? ఎలాగూ రెండు పెళ్ళిళ్ళు చేసుకుంది. ఇంకా ఏ నీతి నియమాలకోసం మడికట్టు కూర్చోవాలి?

—"కన్నమ్మా! నాకు తెలీకడుగుతాను .... ఎవరైనా మంచివాణ్ణి చూసుకుని వాడి అండన వుండిపోకూడదూ? ఎంతకాలం ఇలా గడుస్తుంది నీకు? మీ కులంలో తప్పేంలేదుగా !"

కన్నమ్మ తెల్లబోయింది– ఇంత మంచితల్లి ఈ ముక్క అడిగిందేవిటా అని. కొంచెంసేపు మాట్లాడకుండ కూర్చుంది. — "నీకు తెలవదమ్మా! ప్రపంచకంలో మంచోడెవడు? మొగోళ్ళు తన తల్లీ – తోడబుట్టి-దీ తప్పితే– మిగిలిన ఆడోళ్ళందరూ.పక్కలోకి రావాలని ఉబలాటపడేవోళ్లేనమ్మా! తగులుకున్నోడు నిరవాకం చేస్తాడా? నాలుగు రోజులుంచుకుని తన్ని తగిలేస్తాడు. మళా నా కడుపూ – నేనూ తయారు. లోకులు నా మొహంమీద వుమ్మేస్తారు. ఆ బరువంతా నాకెందుకమ్మా! ఈ మొగోళ్ళని నమ్ముకుని నా వొళ్ళెందుకు గుల్ల చేసుకోవాల? నా రెక్కలు నాకున్నాయి. మీలాంటి తల్లులెందరు లేరు? ఇయ్యాళగాకపోతే రేపైనా నా గుణం తెలవదా? మీ పాదాల దగ్గిర పడుంటాను."

—ఆహా! మనిషి పశువైపోవలసిన ఎన్నో పరిస్థితులలో చిక్కుకుని కూడా ఇంకా ఈ మనిషి మనిషిలా ఎలా వుండగలిగింది? —

కన్నమ్మ ఒళ్లో పాలుతాగుతోన్న కొడుకుని ముద్దులాడుతూ నవ్వింది—"వీణ్ణిస్తే ఆరొందల రూపాయ లిస్తానన్నదొకమ్మ.... అమ్మో నా గుండెల్ని కొరుక్కుంటానుగానీ నాబిడ్డ నిచ్చేసుకుంటానా? ఈడికీ నాకూ ఏనాటి సమ్మంధవో! అందుకే గంగమ్మ కాబుద్ధి పుట్టింది – పెద్ద కొడుకుల్నిద్దర్ని వొదిలేసుకున్నాను. నాలుగేళ్ళుకష్టపడి ఈణ్ణిపెంచుకున్నానంటే ఈడు పెద్దోడై నన్ను పెంచడా?—ఆనాడు గుమ్మంలోకొచ్చి నిలబడితే మీరీ చంటిబిడ్డని చూసి చేరదీశారుగానీ నే నొక్కదాన్నే అయితే పో పొమ్మనరా? ఈడే నాకు దిక్కమ్మా! ఈడే! చూడండమ్మా! ఎలా నవ్వుతున్నాడో నన్నుచూసి...." కన్నతల్లి మురిపెం అది.

"ఇంత పసిగుడ్డుని పెట్టుకొని రైలు పట్టాలమీద కూర్చున్నావు కదూ ఛస్తానని? నీ దుంపతెగ!" నోటిదాకా వచ్చిన మాటలు ఆపుకుంది రాధ, దాని ఆనందంలో నీళ్ళు చిమ్మలేక.

"అవునుగానీ కన్నమ్మా! మొగోడి మొహంచూస్తేనే భయం వేస్తుందన్నావుకదా? మొగాళ్ళందరూ అంతేనంటావా? పెద్దింటివాళ్ళే .... చదువుకున్నవాళ్ళు కూడా అంతేనంటావా?" కుతూహలంగా అడిగింది రాధ.

"ఏదో వాగేశానులేమ్మా: అందరూ అలాంటోళ్ళయితే లోకం తల్లకిందులై పోదా? ఎక్కడో వుంటారు రాములోరిలాంటి బాబులు. వుండనే వుండరా?" అని ఎదురుప్రశ్న వేసింది.

రాధకి చాలా సంతృప్తి కల్గింది—"ఎక్కడో ఏమిటి? నా మొగుడే రాముడు" అందామనుకుంది గర్వంగా.

నిజానికి రాముడి పాత్ర రాధ కిష్టమైందికాదు. కానీ — రాముడు ఏకపత్నీ వ్రతుడంటారే! అందుకే మొగుణ్ణి రాముడితో పోల్చుకోవటం.

సత్యన్నారాయణకి—చాలా "మంచివాడన్న" పేరుంది. ఈ "చాలా మంచి" ఒక స్వభావం గురించే కాదు. శీలం గురించి కూడాను. పరాయి ఆడవాళ్ళతో ఎప్పుడూ చొరవగా మాట్లాడడు. దొంగచూపులు చూడడు. చెడు సంబంధాలు పెట్టుకోగా ఎవ్వరూ చూడలేదు. "సత్యన్నారాయణా? .... ఈ కాలంలో వుండదగినవాడు కాడు" అన్న విమర్శకూడా వుంది. అందుకే రాధకి కన్నమ్మ మాటలు చాలా నచ్చాయి. మంచివాళ్ళే లేకపోతే లోకం తల్లకిందులై పోతుందట—నవ్వొచ్చింది రాధకి. ఈ లోకం సత్యన్నారాయణ బరువువల్లె ఇలా నిల్చివుందో ఏమో!

• • •

అన్ని అనుభవాలతో తలపండిన కన్నమ్మయినా మంచి మొగాళ్లుంటారని ఒప్పుకుందిగానీ లీల ఒప్పుకోలేదు.

లీల కాలేజి చదువు అర్ధంతరంచేసి పెళ్ళి చేసుకుంది. రాధ మరో

ఆకు ఎక్కువ చదివి ఆపనే చేసింది. వాళ్ళిద్దరూ స్నేహం మర్చిపోలేదు. పరిస్థితులుకూడా కలిసి వచ్చాయి. ఇద్దరూ ఆఖరిసారిగా కలుసుకొని ఏడాది పైనే అయింది. అప్పుడు చాలాకబుర్లు చెప్పుకున్నారు. ముఖ్యంగా సంసారాల గురించీ, మొగుళ్ళ గురించీ, కిరసనాయిల్ డబ్బా ఎన్నాళ్ళు వసుందో చెప్పుకున్నారు. సంవత్సరాని కెన్ని చీరలు చిరుగుతాయో— ఏ చీరలు బాగా మన్నుతాయో వాదించుకున్నారు. పిల్లలెలా చదువుతారో ఎంతెంత తెలివైనవాళ్ళో ముచ్చటించుకున్నారు. అంతవరకూ అతిశయా ల్లేకుండా నిజాయితీగా మాట్లాడుకున్నారు.

"మీ ఆయిన మంచివాడేనా?" హఠాత్తుగా అడిగింది లీల.

"అదేమిటే! కొత్తదానిలా అడుగుతున్నావు. మా ఆయన సంగతి నీకు తెలీదా," అంది నవ్వి రాధ.

"అదికాదులే. ఈ ఏడాదిలో నీ అమూల్యాభిప్రాయం పరివర్తన చెందిందేమోనని."

"మా ఆయన ప్రవర్తన మారనంతకాలం నా అమూల్యాభిప్రాయం పరివర్తన చెందే ఖర్మేమిటీ? అటు సూర్యుడు ఇటు పొడవాలిగానీ ఆ రెండూ జరగవు."

"అబ్బో! ఏమిటో ఆ గ్యారంటీ?"

"నమ్మకమే లేకపోతే సంసారాలెలా చెయ్యగలం?"

"మహా చక్కగా చెయ్యొచ్చు. కూడూ, గుడ్డా దొరుకుతోంటే సరి."

"ఏడిశావులే. బొత్తిగా పశువుగా మాట్లాడకు. కూడూ గుడ్డా కోసమా పెళ్ళి చేసుకున్నదీ?"

"మరెందుకటా?"

నవ్వేసింది రాధ — "ఒసే లీలా! మీ ఆయన.... ఎప్పుడో ఏదో చేశాడని ...పాపం నీ దగ్గిర తప్పుకూడా ఒప్పుకున్నాడు కదే?....

"ఆ తప్పే మళ్లా మళ్లా చేస్తే....?"

"ఎందుకు చేస్తారేమిటీ? ఆమాత్రం బుద్ధి వుండదూ?"

"మొదట చేసింది బుద్ధిలేకేనా?....రాధా! నువ్వు అమాయకంగా వున్నావో అజ్ఞానంగా వున్నావో నాకు తెలీదుగాని .... మొగవాళ్ళ గురించి నీకేమీ తెలీదు. వాళ్ళు మనలా వుండరు. ఉండాలని అనుకోరు. ఎవడైనా వుంటే పరిస్థితులు కలిసిరాక, అంతకుమించి వాడొక ధర్మానికి కట్టుబడి కాదు. వాళ్ళు చేసేవి చేసోనే వుంటారు. మనం వింటే సహించ లేమని—మనకి చెప్పరు. నీలాంటిదైతే అమాంతం గుండెపగిలి ఊరు కుంటుంది."

"ఏం? నువ్వయితే మాత్రం? మురిసి ముక్కలవుతావా?"

"నేను — గుండె రాయి చేసుకోగలనే! నా బుర్రంత సున్నిత మైంది కాదులే."

రాధకేం నచ్చలేదు. కొంచెం కోపంకూడా వచ్చింది—"మనుషులు వాళ్ళ అనుభవాల ప్రకారం సూత్రాలు తయారు చేస్తారు. తెలుసా నీకు? నీ మాటలే నమ్మమంటావుగానీ నా మాటలకి విలువ ఇవ్వవేం? భార్యల్ని ప్రేమించి జీవితమంతా ఒక్క భార్యతో నిజాయితీగా బ్రతికే మగవాళ్ళు చాలామంది వుంటారు."

"లీల నవ్వి "ఎప్పుడయినా నీ మొగుడు నీకు ద్రోహం చేస్తేకూడా ఈ మాటలే అంటావా?" అంది.

"ఆఁ అంటాను. లోకం అంటే నా ఇల్లేనా ఏమిటి? నాకు మంచి జరిగితే మంచీనూ, చెడ్డ జరిగితే చెడ్డానా?"

లీల సంభ్రమంగా చూసింది— "రాధా! బాగా కోపం వచ్చిందా? నిజంగా నువ్వంత సుఖంగా బ్రతుకుతున్నావంటే నాకు సంతోషంకాదా? నేనుమాత్రం మూర్ఖురాలినా? అందర్నీ ఎందుకు శంకిస్తాను? సాధార ణంగా మొగవాళ్ళెలా వుంటారో చెప్పాను — మీ ఆయన చాలా ఉత్తము డని నాకూ తెలుసు."

"మా ఆయన్ని పొగడ్డానికేవిలే?....మీ ఆయన మాత్రం....?"

"నీకు తెలీదులే. ఆయనంటే నాకు అనుమానం లేకపోయినా నమ్మకంలేదు. మనస్సు తెగపీకుతోన్న పెళ్లానికి జడిసి మనస్సు మళ్ళించు కోవటంకూడా ఒక మంచితనమేనా?—అసలు పెళ్ళాంమీద ప్రేమవల్ల పరాయి ఆడదానిమీదకి మనస్సు పోకుండా ఉండాలి. ఏం? మనం ఉండ టంలేదూ? అవకాశాలు లేకేనా? మనలా మొగాళ్ళు వుండకూడదూ?"

"అదిగో! మళ్లా మొదటికొస్తున్నావ్. వున్నారు బాబోయ్ అంటు న్నానా?"

నవ్వింది లీల—మనస్ఫూర్తిగా అంది— "నువ్వు చాలా అదృష్ట వంతురాలివే."

రాధకి తన అదృష్టాన్ని తల్చుకుంటోంటే చాలా తృప్తి-గర్వం. సుఖపడుతున్నామని తెలిసి సుఖపడటం ఎంత హాయి!

* * *

కన్నమ్మ వచ్చి నెల దాటింది. పూర్తిగా ఇంట్లో మనిషిలా కలిసి పోయింది. ఇంట్లో సమస్తమైన పనులూ కన్నమ్మే చేస్తుంది. రాధ రెండు పూటలా.... కూరల పని మాత్రం చూస్తుంది. ఇహ తర్వాత ఇక్కడ చెంబు అక్కడ పెట్టే పని వుండదు. చీకట్నే అంట్లుతోమటం దగ్గిర్నుంచీ- ఇళ్ళూ-వాకిళ్ళూ- పిల్లలకి రెండుపూటలా స్నానాలూ — పానాలూ — బట్ట లుతుకూ—మర్నాడు టిఫిన్‌కి పిండి రుబ్బటం—ఇదీ అదీ అనకుండా—బద్ధకం ఎరక్కుండా పని వున్నంతవరకూ పూర్తిచేసి కానీ కూర్చోదు కన్నమ్మ. రాధ మందలించినా వినిపించుకోదు. తను అంత సోమరిగా కూర్చోటంకూడా చిరాకుగానేవుంది రాధకి. పుస్తకాలు చదువుకోటం తప్పితే మరో కాలక్షేపం లేదు.

కన్నమ్మ కొడుకు కొంచెం ఒళ్ళు చేశాడు. బోర్లాపడుకుని పొట్ట మీద పాకుతూ ఇల్లంతా తిరుగుతున్నాడు.

కన్నమ్మ గురించి — పూసగుచ్చినట్టు కాకపోయినా — అప్పు

డప్పుడూ ఒక్కో కబురు చొప్పున చాలా సంగతులు చెప్పింది రాధ సత్యన్నారాయణకి– "పాపం.... చాలా చికాకులు పడింది. ఇన్నాళ్ళ కయినా మంచి యిల్లు దొరికినందుకు ... అదృష్టం అన్నంత మురిసి పోతోంది."

"మంచి యిల్లంటే ?"

"ఏమో! నాకేం తెలుసు? అది అన్న ముక్క మీతో అన్నాను" అంది రాధ గడుసుగా.

"కష్టపడి చాకిరీ చేస్తోందేమో కా స్త నిశ్చింతగా వుంది. లేకపోతే మనం మాత్రం ఆదరిస్తామా?" అన్నాడతను నిజాయితీగా.

రెండు మూడు సార్లు వెంకడికి పట్టే పాలు విరిగిపోతే సత్యన్నారాయణ కాఫీకి వుంచిన పాలు ఇచ్చేసింది రాధ. సత్యన్నారాయణేమీ విసుక్కోలేదు. సరిగదా "పోనీలే — చంటిపిల్లాడికి మాత్రం పాలు లేకుండా చెయ్యకు. అంతకన్నా పాపం వుండదు" అన్నాడు. భర్త కారుణ్యానికి రాధ ఎంత మురిసిపోయిందో రాధకే తెలుసు.

* * *

—వారం రోజులనుంచీ కన్నమ్మకి పొడి దగ్గులా వస్తోంది.

ఒకరోజు రాత్రంతా నిద్రపోకుండానే దగ్గుతూనేవుంది. తెల్లారే సరికి జ్వరం తగిలింది. చలి కుదుపు వచ్చింది. అయినా నెమ్మదిగాలేచి పాచిపనులు చేసింది.

రాధ కన్నమ్మకి కాఫీ ఇస్తూ అడిగింది— "రాత్రి .... నువ్వు చాలా సేపు దగ్గినట్టున్నావ్ కదూ? నాకు విన్పిస్తోనే వుంది."

"అవునమ్మా! అదే పోద్దని వూరుకున్నాను. కరక్కాయన్నా బుగ్గ నెట్టుకున్నాను కాను. రేత్రంతా జొరం, చలి, ఇంకా ఒళ్ళు ఎచ్చగానేవుంది. పొద్దున్న పళ్ళు తోముకుంటుంటే నెత్తురు పడిందమ్మా!"

రాధకి కొంచెం కంగారు పుట్టింది. "అయితే తొందరగా తెమిలి డాక్టరుగారి దగ్గరికి వెళ్ళిరా !"

"అబ్బే! ఎందుకమ్మా! కరక్కాయ...."

"నీ మొహం.... ఈరోజుల్లో ఏదీ ముదరబెట్టుకోకూడదు. మాకు బాగా తెలిసిన డాక్టరుగారున్నారు. అన్నీ వివరంగా చీటీరాసి యిస్తాను. పట్టుకెళ్ళు. ఏమైనా బిళ్ళలు కొనుక్కోమంటే మందులషాపులో కొను"– రాధ చెయ్యి ఖాళీ చేసుకుని డాక్టరుగారికో వుత్తరం రాసింది క్లుప్తంగా. కన్నమ్మని పరిచయం చేసింది—"చాలా మంచి పనిమనిషి. ఎవ్వరూ దిక్కులేరు. మా ఇంట్లో వుంటోంది– మీరు కొంచెం శ్రద్ధగా ఎగ్జామిన్ చెయ్యండి. బిల్లు విషయం అంతా మావారు చూస్తారు" అని రాసింది.

కన్నమ్మ జుట్టు గోళ్ళతో దువ్వి ముడేసుకుంది. గోచీ విప్పి కుచ్చిళ్ళు సర్దుకుంది. చీటీ అందుకుంటూ— "ఎంకడిని తీసుకుపోతానమ్మా!.... ఆడేడిస్తే....మీ పని...."

"వాడెందుకే తద్దినం నీకూ, నిక్షేపంలా పడుకున్నాడు. ఏడిస్తే పాలు పడతాలె. కొంచెం తొందరగా వెళ్ళు"— డబ్బులిస్తూ ఆస్పత్రికి వెళ్ళే వివరాలన్నీ చెప్పి కన్నమ్మని తొందరచేసి పంపించింది.

రాధ పనులన్నీ పూర్తిచేసి స్నానానికి వెళ్ళబోతూంటే రాగం అందుకున్నాడు వెంకడు. వాడికి పాలుపట్టి ఎత్తుకు తిప్పుతోంటే వచ్చింది కన్నమ్మ–వస్తూనే నవ్వుమొహంతో "డాక్టరుబాబు ఎంత మంచోరమ్మా!" అంది.

"ఏం? ఏమైందేవిటీ? ఏమన్నారూ?"

"ఇండీషను చేశారు. మాత్రలిచ్చారు. మీకి వుత్తరం యిమ్మన్నారు" కన్నమ్మ కొంగున కట్టుకున్న ఉత్తరం విప్పి యిచ్చి కొడుకుని అందుకుంది. రాధ గదిలోకెళ్ళి వుత్తరం చదివింది – కన్నమ్మ జబ్బు గురించి కొంచెం జాగ్రత్తగా వుండాలని హెచ్చరిస్తూ రాశాడు డాక్టరు.

— రక్త పరీక్ష చేయాలి. ఎక్సరే తీయాలి. అంతవరకూ రిజల్టు చెప్పలేను. టి. బి. లక్షణాలు కొన్ని కన్పిస్తున్నాయి. మీరు జాగ్రత్తగా వుంటారని ఈ విషయం రాశాను. ఒక వారం పది రోజులు వరసగా ఇంజక్షను ఇచ్చి చూస్తాను టాబ్లెట్స్ ఇస్తున్నాను. శ్రద్ధగా వాడించండి. టి. బి. కాకపోతే ఈ ట్రీట్‌మెంట్‌తో బాగయిపోతుంది. మరేం భయం లేదు.

రాధ గుండెలు దడదడా కొట్టుకున్నాయి. ఏమీ పాలుపోలేదు. బాత్‌రూమ్‌లో పెట్టుకొన్న వేడినీళ్ళమాట జ్ఞాపకంవచ్చి గబగబా బయటి కెళ్ళింది.

"అమ్మా డాక్టరుబాబేం రాశారు?"

"అబ్బే! ఏమీలేదు. మాత్రలు శ్రద్ధగా వేసుకోమన్నారు. రోజూ ఆస్పత్రికి వెళ్ళి ఇంజక్షన్ చేయించుకురావాలి."

ఆ సాయంత్రం – విషయం సత్యన్నారాయణకి చెప్పింది రాధ.

"కొంచెం జాగ్రత్తగా వుండు. పై పనులు చెయ్యనీగానీ వంటింట్లోకి రానివ్వకు. ఎందుకైనా మంచిది" అని వూరుకున్నాడతను.

భర్త ఇంకేమీ అననందుకు చాలా ఆశ్చర్యపోయింది రాధ. ఇంట్లోంచి పంపించెయ్యమంటాడేమోనని చాలా భయపడింది.

పొమ్మనటం సులువేగాని పాపం ఎక్కడికిపోతుంది? ఆ దగ్గేవిటో నిర్ధారణ అయ్యేవరకయినా సహించాలికదా?

తర్వాతకూడా రెండు రోజులు కన్నమ్మని ఆస్పత్రికి పంపించింది రాధ. మూడోనాడు రాధ పుట్టింటినుంచి టెలిగ్రాం వచ్చింది – రాధ నాయనమ్మకి సీరియస్‌గా వుందనీ— రాధని కలవరిస్తోందనీ. ఆవిడ ఓ ఏడాదినుంచీ పక్షవాతంతో తీసుకుంటోంది. ఎప్పటి కప్పుడే చచ్చి పోయేంత హంగామాచేసి–అందర్నీ చూశాక బతికి బయటపడుతోంది. అందుకే, టెలిగ్రాంచూచి సత్యన్నారాయణ నవ్వుతూ "మీ నాయనమ్మ కాదుగానీ మనల్ని చంపుతోంది. ఏం ఫర్వాలేదులెద్దూ! ఆవిడే బతికే స్తుంది. బతకటం మానేసిందని మళ్ళా కబురొస్తే వెళ్దుగాన్లే" అన్నాడు.

రాధకి కోపం వచ్చింది. అప్పటికే ఏడుపొచ్చేస్తోంది. నాయనమ్మంటే రాధకి చాలా ఇష్టం. రాధ చిన్నప్పుడంతా నాయనమ్మ దగ్గరే పెరిగింది– నాయనమ్మ చేయించిన చక్రాల లోలాకులు దాచుకుని ఇప్పటికీ పెట్టుకుంటూ వుంటుంది. భర్తగారి హాస్యానికి ఏడుపుముఖంపెట్టి – "నేనంటే మా నాయనమ్మకెంత ప్రాణమో తెలుసా? నన్ను చూడకపోతే అది నిజంగా చచ్చిపోతుంది. ఇప్పుడు ట్రయినుంటే దానికి వెళ్ళిపోతాను" అంది రైలెక్కబోతున్నట్టు.

"పిల్లల్ని తీసికెళ్ళవా? నన్ను చంపుకు తింటారు."

సాయంత్రం పిల్లలు వచ్చేవరకూ ఆగాల్సి వచ్చింది రాధ. ఈ లోపల పెట్టెసర్ది సిద్ధంగా వుంచింది. ఇంటి వ్యవహారాలన్నీ కన్నమ్మకి చెప్పింది. సత్యన్నారాయణ హోటల్లో తింటాడు. కన్నమ్మ ఒక్కతీ కొంచెం అన్నం కూరా వండుకుంటుంది– తిండి ఏర్పాట్లు చేసేసింది.

"నువ్వు ఆస్పత్రికి వెళ్ళటం మానకుసుమా!" అని హెచ్చరించింది కన్నమ్మని. ఇల్లంతా దానిమీద వదిలేసి బండెక్కింది.

సత్యన్నారాయణ – పెళ్లాన్నీ, పిల్లల్నీ రైలెక్కించి – "బెంగ పడుతూ కూర్చోకు. ఏదీ మన చేతులో లేదు. ఏం చేస్తాం .... పిల్లలు జాగ్రత్త! .... మళ్ళీ ఎప్పుడొస్తావు?"– మాట్లాడుతూ నిలబడ్డాడు.

"నాయనమ్మకి బావుంటే వారం పదిరోజుల్లో వచ్చేస్తా."

"అక్కడికెళితే అంతా మర్చిపోతావు. వచ్చే ఆదివారం వచ్చేశావంటే నేను స్టేషన్‌కి రావటానికి వీలుగా వుంటుంది. లీవు ఇంకా పొడిగించకు" అంటూ నవ్వాడు.

రాధ మూతి ముడుచుకుంది –

"ఇప్పుడు ఇంటికి వెళ్ళినా నిద్రపట్టదు. సెకండ్‌షోకి వెళ్తా" అన్నాడు వాచీ చూసుకుంటూ.

"పాపం కన్నమ్మకూడా ఒక్కతీ చంటిపిల్లాడితో వుంటుంది. కొంచెం తొందరగా ఇంటికెళ్ళండి."

రైలు కదిలింది. రాధ మనస్సంతా చాలా భారంగా అయిపోయింది. ప్లాట్‌ఫారమ్ మీద నుంచున్న భర్తని కనిపించేవరకూ చూస్తోనేవుంది. వారం పదిరోజులు అతన్ని వదిలి వుండటంకూడా కష్టమే.

• • •

రాధతోపాటు అక్కలూ-అన్నలూ-మేనత్త పిల్లలూ — రావలసిన వాళ్ళంతా వచ్చారు. అట్టహాసంగా ముసలావిణ్ని సాగనంపడానికి — అందర్నీచూచి తేరుకుని బతికేసిందావిడ- నాలుగోసారి.

"హరినీ! ఇదో వేషంలా వుందే నీకూ?"

"మళ్ళా మాకు సెలవు దొరకదు ఈసారి నువ్వు నిజంగా చచ్చిపోయినా మేము రాము; మర్యాదగా ఆ పనేదో యిప్పుడే కానీ!" అన్నారు మనవలంతా బెదిరిస్తూ.

"ఏం చేయన్రా? నారాయణుడు నన్ను తీసికెళ్ళటం లేదు" అందావిడ ధీమాగా-బోసి చిరునవ్వులు నవ్వుతూ.

"చిత్రగుప్తుడు నీ ఫైల్ పారేశాడో ఏవిటో? వెధవ ఆఫీసులు. ఈమధ్య ఇలాగే ఏడుస్తున్నాయి" అన్నాడు ఆఫీసర్ మనవడు. "కాదర్రా! అమ్మమ్మ చిత్రగుప్తుడి నోము నోచిందర్రా నాలుగయిదుసార్లు. ఎంతైనా ఇప్పట్లో ఆర్డర్స్ వెయ్యడు. పదండి పోదాం."

"అబ్బ! నాయనమ్మని అలా అనకండర్రా! ఎంత మంచిది! చిన్నప్పుడు అమ్మ చూడకుండా మనకి మీగడంతా వేసేసేది. బెల్లంముక్కలు పెట్టేది" అంది రాధ.

"అవునవును. నీకు లోలాకులు చేయించిందికదూ? అందుకని నువ్వు దానికి సపోర్టు పలుకుతావులే."

"నాయనమ్మా! నీ దగ్గర చాలా డబ్బుందట. మాకందరికీ పంచుతావా? లేదా? పంచనని చెప్పు చూపిస్తాను నా తడాఖా!" — ఓ మొండి మనవడు.

"రామః రామః చిల్లిగవ్వ లేదర్రాః చచ్చేముందు అబద్ధం ఆడనర్రా!"

"నాయనమ్మాః నిజంగా నీకు చచ్చిపోవాలని వుందిటే? అదీ తేల్చు ముందు."

"ఉందర్రా ! నారాయణుడు పిలవడు. నేనేం చెయ్యనూ ?" పాయంటే !

"పోనీ ఒకపని చేసాం. నీ పేర్న మేమంతా నారాయణుడికి పూజలవీ హోరెత్తాలా చేసేసాం. నువ్వు వచ్చేస్తానంటూన్నావని అర్జీలు పెడతాం. ఏం? అలా చెయ్యమంటావా ?"

"ఎందుకులెండి నాయనాః అప్పుడే ఏం కంగారూ? నారాయణుడేం పనిలో ఉన్నాడో!" అంది నాయనమ్మ సహనంగా.

అందరూ నాయనమ్మని ఆడిస్తూ నవ్వుల్తో గడిపేశారు. వారం రోజులు. ఒక్కొక్కళ్ళు తిరుగు ప్రయాణం ప్రారంభించారు.

రాధ నొక్కదాన్నీ ఇంకా రెండురోజు లుండమంది నాయనమ్మ.

అనుకున్న ఆదివారం రాధ బయలుదేరలేదు.

సత్యనారాయణ స్టేషన్‌కొచ్చి విసుగ్గా తిరిగెళ్ళిపోయాడు.

* * *

—తర్వాత మూడు రోజులకి మిట్టమధ్యాన్నం దిగింది రాధ పిల్లల్తో. కన్నమ్మ గబగబావచ్చి తలుపు తీసింది—"అమ్మాః మంచినీళ్ళు కావాలా? అంది వద్దంటూ లోపలికి నడిచింది రాధ.

ఇలూ—వాకిలీ అద్దంలా వున్నాయి. నాలుగురోజు లెక్కడికయినా వెళ్ళి ఇంటికొస్తే ఇల్లంతా మట్టికొట్టుకుపోయి వుండేది. ఎక్కడి సామాన్లక్కడ పొందిగ్గా వున్నాయి.

"నీ ఒంట్లో ఎలావుంది కన్నమ్మా?"

"బాగుందమ్మా ! కొంచెం దగ్గు తగ్గింది."

"వెంకడెలా ఉన్నాడు?"

"బాగున్నాడమ్మా!"

"బాబు ఎప్పుడెళ్ళారు బయటికి?"

"పొద్దుటే ఎళ్ళిపోయారమ్మా! రాత్రికిగానీ రారనుకుంటా. మీరు ఆదివారం రాలేదని బాబు చాలా ఇసుక్కున్నారు." రాధ నవ్వుతూ "ఏం? ఏమన్నారేమిటీ?" అంది.

"అన్నట్టు.... మాయమ్మగారి కెలాగుందమ్మా?"

"బాగుంది. సుఖంగానే ఉంది."—

—పిల్లలకి స్నానాలు చేయించి బట్టలు మార్చింది కన్నమ్మ. వాళ్ళు హుషారుగా ఆడుకోవటానికి పోయారు.

రాధ వంటలో మునిగింది.

సత్యన్నారాయణ వచ్చేసరికి—పనంతా తెముల్చుకుని—స్నానంచేసి పువ్వులా సింగారించుకుని కనిపించాలని రాధ ఆత్రుత.

కన్నమ్మకి పైపనులు పురమాయిస్తూ తను వంట ముగించింది. స్నానంచేసి తెల్లచీర కట్టుకుంది. జడ అల్లుకుని బొట్టు పెట్టుకుంది. పిల్ల లొస్తే గబగబా అన్నాలు పెట్టింది. అప్పటికే ఎనిమిది దాటింది.

"కన్నమ్మా! పిల్లలకి పక్కలెయ్యి. తొందరగా పడుకుంటారు. పగలంతా రైల్లో ఉండి నానా హైరానా పడ్డారు. వెధవ ప్రయాణం. వారం రోజులకిగానీ ప్రాణాలు చేరుకోవు.

పిల్లల్ని మందలించి తొందరగా పడుకోబెట్టింది.

"కన్నమ్మా! మరువం బాగా ఎదిగిపోయినట్టుంది. కొంచెం తెంపి తీసుకురా! మాల కడతాను."

"దీపాలు పెట్టాక కొయ్యకూడదమ్మా"

"ఫర్వాలేదు లెద్దూ! ఇందాకే చెప్దామని మర్చిపోయాను." కన్నమ్మ ఒక ప్లేటునిండా మరువం రెమ్మలు తెంచి తెచ్చింది. రాధ తీరిగ్గా మాల కట్టడానికి కూర్చుంది.

— "చెప్పు కన్నమ్మా? కబుర్లేమిటీ?"

కన్నమ్మ తల దించుకుని కూర్చుంది. మాట్లాడలేదు.

"మనింటి కెవరయినా వచ్చారా నేను లేనప్పుడు?"

"లేదమ్మా! బాబు యింట్లోనే వుండేవోరు .... కారు, ఇంకెవ రొస్తారు?"

"ఇప్పుడు నీ ఒంట్లో తేలిగ్గా వుందా? ఎక్కడా దగ్గుతోన్నట్టు లేదే?"

"................"

"అదేమిటి కన్నమ్మా! మాట్లాడవేం?....ఇలా చూడు!....అరె! అలా వున్నావేమిటి? డాక్టరుగా రేమన్నా చెప్పారా?"

కన్నమ్మ తల అడ్డంగా వూపింది మాటలురాక. కళ్లెట నీళ్ళు అటూ ఇటూ పడ్డాయి.

రాధ తెల్లబోయింది — "ఏమిటి కన్నమ్మా! ....చిన్నపిల్లలా.... చెప్పకుండా ఏడుస్తావేం?" బుజ్జగిస్తూనే మందలింపుగా అడిగింది.

అప్పటికీ కన్నమ్మ కాస్సేపు మాట్లాడలేదు — గబగబా కళ్ళు తుడుచుకుని అంది— "బాబుకి నామీద చాలా కోపంగా వుందమ్మా!"

"బాబుకా? నీమీద కోపం ఏమిటి? ఎందుకూ? ఏదన్నా పనిచెప్పే చెయ్యనన్నావా?....ఛ! నువ్వలా ఎందుకంటావు?" అమ్మా! అంతా నా ఖర్మ. అంతే అనుకోవాల మరి. కన్నమ్మ గొంతు పూడుకొచ్చింది. కన్నమ్మ మొహంకూడా ఎప్పట్లా కళగాలేదు.

రాధ గుండెలు దడదడలాడాయి. మనస్సేదో శంకించటం ప్రారంభించింది—కంపించే కంఠంతో కొంచెం అధికారంగా అడిగింది. "ఎందుకా ఏడుపు? చెప్పేదేదో చెప్పకపోతే.... నాకెలా తెలుస్తుంది? అసలేమైంది? ఆయన నిన్నేమన్నారు?"

కన్నమ్మ బావురుమంది—"అమ్మా! మీ పాదాలసాక్షి. నా మాట నమ్మండి. నేను చెడ్డముండని కాను— మీకు ద్రోహం చేస్తానా అమ్మా, నే నొప్పుకోలేదు" అదిరిపడింది రాధ. శరీరమంతా కంపనం పుట్టింది.

వేళ్ళు వశంతప్పిపోయాయి. మరువం మాల ఒళ్ళో పడేసుకుంది. వెర్రిచూపులు చూసింది. నోరు పెగుల్చుకుంటూ అడిగింది_ "ఏమిటి? ఒప్పుకోకుపోవటం ఏమిటి? .... అసలేమైందో చెప్పవేం? .... అంతా చెప్పు. నేను వినాలి."

"మళ్లా బాబు నడగకండమ్మా!"

"ఏం? అడిగితే నీకేం?" కోపంగా అంది రాధ.

"మీ పాదా లట్టుకుంటానమ్మా! నన్ని కూటికి దూరంచెయ్యకండి. అసలే బాబుకి నామీద పుట్టెడు కోపంగా వుంది.... నసేమిరా మీతో చెప్పొద్దని నన్ను బెదిరించారు."

రాధకి పటరాని కోపం వచ్చేసింది_"అసలేమైందంటే చెప్పవేం? .... ఏమిటా నిర్లక్ష్యం నీకు?" అరిచినంత కసురు కసిరింది.

కన్నమ్మ బిత్తరపోయింది. "ఆదివారం రాత్రమ్మా .... బాబు ... మీకోసం బండి కెళ్లొచ్చారు కోపంగా వొచ్చారు .."

రాధ మనఃప్రపంచం గిర్రున తిరుగుతోంది___

ఆదివారం రాత్రి సత్యన్నారాయణ రాధకోసం స్టేషన్కెళ్ళాడు. సాధారణంగా రాధ ఆ బండికే వస్తుంది. బండి వెళ్లేదాకా చూశాడు___ నిరాశపడి వెనక్కి తిరిగాడు. కాస్సేపు బజార్లో గడిపాడు ___ హోటల్లో భోంచేశాడు___పదిగంటలవేళ ఇంటిముఖం పట్టాడు.

కిన్నమ్మ మెలకువగానే వుంది. తలుపు తీసింది.

"అమ్మగారు రాలేదా బాబూ?"

"రాలేదు" విసురుగా గదిలో కెళ్ళిపోయాడు.

కన్నమ్మ గది గుమ్మందగ్గరకెళ్ళి అడిగింది_"పాలు తెమ్మంటారా బాబూ? తోడెట్టెయ్యమంటారా ?"

"నా కక్కర్లేదు. ఏదో ఒకటి చెయ్యి."

కన్నమ్మ వంటింట్లోకొచ్చి వున్న కాసిన్నిపాలూ తోడెట్టింది. తలుపులన్నీ వేసి_లైట్లు తీసేసి వరండాలోకొచ్చి తన పక్క దగ్గిర చతికిలబడింది. వెంకడు నిద్రపోతున్నాడు. వాణ్ణి బాగా పక్కలోకి

జరువుతుంది - నడుంవాల్చిందో లేదో కునుకు పట్టేసింది. గంటా గంట న్నర పైగా నిద్రపోయినట్టే గుర్తు దానికి —

తటుక్కున మొహంమీద లైటు పడింది. తట్టి లేపినట్టు మెలుకు వొచ్చింది. కంగారుగా పెట సరుకుంది - గుమ్మంలో నించున్న మనిషిని చూసి నిద్రకళ్ళతో పోల్చలేక — "ఎ ... ఎ ... ఎ ...." అంటూ వెర్రికేక లేసింది.

"నేనే! నేనేలే.... నేనే.... మంచినీళ్ళు కావాలనీ...." నించునే వున్నాడు సత్యన్నారాయణ. బనీనూ—లుంగీ వున్నాయి ఒంటిమీద. చటుక్కున లేచింది కన్నమ్మ- "మర్చిపోయాను బాబూ! వంటింట్లోనే ఉంది కూజా."

"తీసుకురా!" వెళ్ళిపోయాడు గదిలోకి.

కన్నమ్మ పిల్లాడిమీద గుడ్డకప్పి — వంటింట్లో కెళ్ళి గ్లాసూ, కూజా తీసుకుని రాధా, సత్యన్నారాయణ పడుకునే గదిలో కెళ్ళింది. గదిలో లైటు వేసివుంది. ఎప్పుడూ మూయని కిటికీ తలుపులు మూసివున్నాయి. మంచానికి వున్న దోమతెర ఎదరగా ఎత్తిపట్టి వుంది. ఇవన్నీ మొదట నిద్రకళ్ళతో గమనించలేదు కన్నమ్మ. సత్యన్నారాయణ మంచంమీద కూర్చుని వుండటం చూసింది. దగ్గిరికివెళ్ళి కూజా, గ్లాసూ బల్లమీద పెట్టింది — "మంచినీళ్ళిమ్మంటారా బాబూ?"

"నే తాగుతాలే" గ్లాసులోకి నీళ్ళు వొంచుకొని ఒక్క గుటికెడు తాగి గ్లాసు కూజాపక్కన పెట్టేశాడు — "అదిగో! ఆ డ్రాయరు తీసి అమృంతాంజనం సీసా వుంటుంది చూడు."

ఆ డ్రాయరు ఒక్క అడుగువేస్తే అతనికి అందుతుంది.

— "ఈ సొరుగులోనా బాబూ?" — కన్నమ్మ సొరుగులోంచి అమృంతాజనం సీసా తీసి మంచం దగ్గిరికి వచ్చి సత్యన్నారాయణకి అందించబోయింది.

ఆదేం పట్టించుకోనట్టు సత్యన్నారాయణ కూర్చున్నవాడల్లా పడుకున్నాడు — "కొంచెం ఇలారా! ఇక్కడరాయి... తల బద్దలవుతోంది."

కన్నమ్మకి అయోమయం అయిపోయింది. "మీరే రాసుకోండి బాబూ! అవతల పిల్లోడొక్కడూ వున్నాడు."

"వాణ్ణికూడా తీసుకొచ్చి ఆ మంచంమీద పడుకోబెట్టు. అవతల ఎందుకూ? చలిగాలి. నేను తీసుకురానా?"

కన్నమ్మ నిద్రమత్తు పూర్తిగా విడిపోయింది. కాళ్ళూ చేతులూ వణకటం మొదలెటాయి. అమృతాంజనం సీసా బల్లచివర పెట్టేసి— "వద్దు బాబూ! మీరే రాసుకోండి. నేను పిల్లోడిదగ్గర పడుకుంటా" అంది చటుక్కున వెనక్కి తిరుగుతూ.

"ఏయ్! ఏమిటా నిర్లక్ష్యం నీకు? నించో ముందు. నా యింట్లో వున్నదానివి నేను చెప్పినట్టు చెయ్యవా?"

కన్నమ్మకి ఘోరున దుఃఖం వచ్చేసింది—"అదేంమాట బాబూ? ఎందుకు చెయ్యను? రెక్కల చాకిరీ చెయ్యమంటే చెయ్యనా? మీ రెంతో మంచోరని అమ్మగారు చెప్తే – ధయిర్యంగా వున్నాను బాబూ!"

"ఏం? ఇప్పుడుమాత్రం ఏమైంది?—మా ఇంట్లో వుంటే నీకేం లోటు? —అమ్మగా రొక్కతే— నా ఇష్టం లేకుండా—నిన్ను ఆదరించి వుంచుకుందనుకుంటున్నావా? — మళ్లా —యిల్లిల్లూ తిరగాలని వుందా? ఇందులో నాకూ తప్పులేదు — నీకూ తప్పులేదు. ఎందుకలా భయపడి పోతావ్?— ఎవరికి తెలీదు. అమ్మగారికి నేను చెప్పను."

కన్నమ్మ గజగజా వణికిపోయింది—"తెలుసుందని కాదుబాబూ! తెలవకపోయినా వొద్దు —మీరంటే అమ్మగారికెంతో ప్రేణం. మిమ్మ ల్నొక దేవుళ్లాగా–రాములోరిలాగా–చూసుకుంటుందా తల్లి. ఆరిమొహం చూడండి బాబూ! మీరిద్దరూ సీతారాముల్లోంటివారు బాబూ!— నాలాంటి ముండతో మీకేంటి? — మీ అరిపాదం ముట్టటానిక్కూడా పనికిరాను బాబూ!"

వంకలెంచటం కాదుగానీ — కన్నమ్మ చూడ చక్కనిదికాదు. పొట్టిగా పిట్టంత మనిషి. నల్లటి నలుపు. మొహంనిండా స్ఫోటకం గుంటలు. జిడ్డుకారుతోన్న వెంట్రుకలు — అక్కడక్కడా నెరిసి —

నిమ్మకాయంత ముడి. చేతులకి నాలుగేసి పాత రబ్బరుగాజులు, కట్టిను చీర మాసి తెల్లంచుకూడా నల్లచీరతో కలిసిపోయింది. ఒళ్ళంతా చెమట వాసన. పిల్లాడి కక్కులకంపు. రాధ అజ్మాయిషీ లేక కన్నమ్మ మరీ ఎడ్డిగా తయారయింది.

కన్నమ్మని కావలించుకోవాలని ఆరాటం ఎక్కువయింది సత్యన్నారాయణకి. లేచి నుంచున్నాడు. తటపటాయిస్తూనే ముందు కడుగేసి కన్నమ్మ చెయ్యి పట్టుకున్నాడు—"అదంతా నాకు తెలుసులే. మీ అమ్మగారి కేంలోటొచ్చిందిప్పుడు? ఇలా రా కన్నమ్మా! ముందిలా మంచం మీద కూర్చో" అంటూ బలవంతంగా మంచం దగ్గరికి లాగాడు.

"బాబూ—బాబూ! వదలండి — మీ అప్పచెల్లెలాంటిదాన్ని. నన్నన్నేయం చెయ్యకండి— అమ్మగారికి నా మొకం చూపించలేను. పురుగులు పడిపోతాను బాబూ! మీ పాదాలు పట్టుకుంటాను. మీ కాళ్ళకి దణ్ణం పెడతాను" వలవలా ఏడుస్తూ కాళ్ళట్టుకోబోయింది.

"ఛీ! ఏమిటా ఏడుపు?— నా మాటిను. అమ్మగారికి తెలియదు— నా మాట నమ్ము—ఇలా చూడు! నీ కొడుకుని పెంచి పెద్దోణ్ణి చేసుకోవాలని లేదా? వాడికి చదువుసంధ్య లక్కర్లేదా? —"

"మా ఇంట్లో వుంటే నీకేంలోటు? నీ కెప్పుడు కావలసినా నన్ను డబ్బులడుగు. ఇప్పుడిమ్మంటావా?— చెప్పు అడిగి తీసుకోవాలిగానీ—ఇంత మొండిపట్టు పడతావేం?—"

సత్యన్నారాయణ బట్టలస్టాండు దగ్గిరికివెళ్ళి పేంటు జేబులోంచి పర్సుతీసి— పదిరూపాయల నోట్లు తెచ్చి— కన్నమ్మ చేతిలో పెడుతూ — "ఉంచుకో. ఎందుకైనా వుంటుంది. ఉంచుకో — తర్వాత మళ్ళా ఇస్తాలే. తీసుకో కన్నమ్మా!"

బిక్కచచ్చి నించున్న కన్నమ్మ నోటుని పురుగుని విదిలించినట్టు విదిలించేసింది— "మీకు డబ్బుంటే ఉండనివ్వండి బాబూ! నన్ను బలవంతం చెయ్యటానికి మీకేవీ అక్కులేదు. నాకు మీరిచ్చే రూపాయలూ

వొద్దు. నా కొడుక్కి ఇలాంటి చదువు సందెలూ వొద్దు. బతకలేకపోతే ఆడిని నూతిలో ఎతేసి—నేనూ నూతిలో ఉరికేసా. నేను చెడ్డముండని కాను బాబూ; ఇప్పుడే నాదార్ని నేను పోతా—" ధైర్యంగా సత్యన్నారాయణ చెయ్యి విదిలించేసి గుమ్మందాటి వెళ్ళిపోయింది—కొడుకుని ఎతి ఒళ్ళో పెట్టుకుని—"నాయనా! ఎంకన్నా! మన కష్టాలు తీరవురా తండ్రీ!" అంటూ గుండెలు కవిలేలా ఏడుస్తూ కూర్చుంది. కొయ్యబారిపోయిన సత్యన్నారాయణ కదిలి గుమ్మంలో కొచ్చాడు— "ఇదుగో మాట—అయిందేదో అయిందిలే. నాదే తప్పు. నువ్విలాంటిదానివని నాకు తెలీదు—మర్చిపో. అమ్మగారికి మాత్రం చెప్పకు. చాలా గొడవ వస్తుంది మా యిద్దరికీ. నామాట జ్ఞాపకం వుంచుకో. అమ్మగారికి ఒక్కమాటకూడా చెప్పకు" రెట్టించి మరీ చెప్పి వెళ్ళిపోయాడు.

కన్నమ్మకి కంటిమీద కునుకు రాలేదు.

వరండాలో లైటు వుంచుకుని తెల్లవార్లూ రాయిలా కూర్చుంది.

• • •

"అమ్మా! బాబుకీ మీకూ జగడం పెటాలనికాదు నేను చెప్పింది. ఇలాంటి కబురు దాసినందుకే గంగమ్మ నాకు బాగా బుద్ధిచెప్పింది. ఈ కబురు నా కడుపులోనే దాసాననుకోండి. రేపట్నుంచీ బాబు మళ్ళా ఏదయినా అంటే అదిమీ కంటపడితే—అప్పుడేమనుకుని ఏంలాభం? ఎంత చెప్పినా నన్ను నమ్ముతారా? నా పూచీ తీరిపోయింది. మీ పెనిమిటిని మీరే అదుపులో పెట్టుకోండి. ఒక కన్నేసి చూసుకోండి — నేనంటే బాబుకి చాలా కోపంగా వుంది. నన్ను నీళ్ళ ముంచినా పాలముంచినా మీరే. మీరే దిక్కు నాకు" కన్నమ్మ కంఠం తేలిగ్గా విడింది. మొహం తేటపడింది. గుడ్లప్పజెప్పి చూస్తూ కూర్చుంది.

రాధకి బాహ్యస్మృతి పోయింది ఆదిలోనే. కలలోలా వింది. భయంకరమైన పీడకల చూసినట్టుంది అప్రయత్నంగా లేచి నించుంది. ఒదువంలో రెమ్మలు తుళ్ళి దూరంగా పడ్డాయి. తొక్కుకుంటూ నడి

చింది- తూలుతూ అడుగులేసింది. తల గిర్రున తిరుగుతోంది. కళ్ళు చీకట్లు కమ్ముకొచ్చాయి. కాలికి తగిలిన పక్కమీద పిల్లలమధ్య పడి పోయింది.

అలాంటి అచేతన స్థితిలో ఎంతసేపు ఉందో రాధకి తెలియదు.

పదకొండు దాటింది. సత్యన్నారాయణ తలుపుకొడితే కన్నమ్మ వెళ్ళి తీసింది తల దించుకు వెళ్ళిపోతోన్న సత్యన్నారాయణ వెనకాల అంది- "అమ్మగారొచ్చేశారు బాబూ!"

అదిరిపడ్డట్టు ఆగి వెనక్కి తిరిగిచూసి ముందు కడుగేశాడు — గుమ్మంలో నిలబడ్డాడు. గది చీకటిగా వుంది. రాధ పరుపుమీద లేదు. పిల్లలమధ్య పడుకొని నిద్రపోతోంది.

సత్యన్నారాయణ తటపటాయించాడు — బట్టలువిప్పి టవలు కట్టుకుని బాత్‌రూమ్‌లోకెళ్ళి స్నానంచేసి వచ్చాడు. లుంగీ కట్టుకుని టవలు ఆరవేశాడు. రాధకి మెలకువొచ్చిన జాడలేదు. ఈ కన్నమ్మ ముండ చెప్పెయ్యలేదుకదా? ఏడిసింది. దానికంత ధైర్యమెక్కడిది? — తను వద్దన్న తర్వాతకూడా చెప్పిందంటే దానిగతేమౌతుందో తెలీదూ?

నెమ్మదిగా వెళ్ళి రాధపక్కన కూర్చున్నాడు. జుట్టుమీద చెయ్యేసి నిమిరాడు — త్రుళ్ళిపడింది రాధ. చీకట్లో దెయ్యాన్ని చూసినంత జడుసుకుంది. చటుక్కున లేచి కూర్చుంది. రాధ మొహం ఎలావున్నదీ సత్యన్నారాయణకి అంతుచిక్కలేదు.

"ఏ బండి కొచ్చావ్ నువ్వు?"

"మధ్యాహ్నం...."

"మీ నాయనమ్మ కెలావుంది?"

"బాగా.... లేదు."

"పోనీ.... ఇంకో నాలుగురోజులుండలేకపోయావా?"

"........."

"ఏం రాధా అలాగున్నావ్? ఒంట్లో బాగాలేదా?"

"తలనొప్పిగా ఉంది"

"మరి చెప్పవేం? అమృతాంజనం రాయనా?"

"ఊహూ! నాకా వాసన బావుండదు .... మీకు .... అన్నం పెట్టనా ?"

"అక్కర్లేదు— నువ్వొచ్చావని నాకు తెలీదుగా? .... హోటల్లో తినేశాను."

రాధ లేచి వరండాలో కొచ్చింది.

కన్నమ్మ కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకొంది— "కన్నమ్మా!"

కునుకు తీస్తోన్న కన్నమ్మ ఉలిక్కిపడి లేచింది— "ఏంటమ్మా?"

అన్నం తినకుండా పడుకున్నావేం? నాకు నిద్ర పట్టేసింది. నువ్వు పెట్టుకు తినెయ్యలేకపోయావా? లేచిరా? గిన్నె తెచ్చుకో. అర్ధరాత్ర యింది."

"ఇప్పుడేం తిండిలేమ్మా ?" అంటూనే కన్నమ్మ గిన్నెతెచ్చి గుమ్మంలో పెడుతూ— "మీ రొడ్డించుకోరా అమ్మా?" అంది.

"తలనొప్పిగావుంది. ఏదీకానివేళ అన్నం తింటే నా కసలే అరగదు. కొంచెం మజ్జిగ తాగుతా."

"బాబుగారో?"

"తినేసి వచ్చారు."

కన్నమ్మ గిన్నెలో అన్నం కూరలూ పెట్టేసి-గ్లాసులో మజ్జిగపోసి చెయ్యి కడుక్కుని గదిలో కెళ్ళిపోయింది.

సత్యన్నారాయణ పరుపుమీద పడుకుని వున్నాడు. రాధ మళ్లా పిల్లలమధ్య పడుకుంది.

"రాధా! అక్కడ పడుకున్నావేం? ఇలా రా!"

"చంటివాడికి బాగాలేదు. ఉలికులిక్కి పడుతున్నాడు. జడుసు కుంటాడో ఏమో!" రాధ లేచి వెళ్ళలేదు.

"ఏం? వాడికేం బాగాలేదూ?"

"కొంచెం ఒళ్ళు వెచ్చగా వుంది."

ఊరుకున్నాడు సత్యన్నారాయణ. రాధ తనదగ్గిరికి రాకపోవటానికి కారణం చంటివాడు మాత్రం కాదు. కన్నమ్మ చెప్పెయ్యలేదుకదా ? చెప్పేస్తే ఇంత కామ్‌గా ఊరుకుంటుందా రాధ? నిలదీసి అడగదూ ? వాళ్ళ నాయనమ్మ బెంగలోంచి తేరుకోలేదేమో? ఆవిడ కాస్తా హరీ యంటే ఈవిణ్ణెలా ఓదార్చాలో మరి.

సత్యన్నారాయణ ఉత్సాహం తగ్గిపోయింది. బలవంతంగా నిద్ర పట్టించుకోవాలని ప్రయత్నించాడు.

రాధకి మాత్రం తెల్లవార్లూ నిద్రపట్టలేదు. దిగ్భ్రమతో మనసు బండబారిపోయింది. కళ్ళు చెమర్చనైనా చెమర్చలేదు.

— మర్నాడంతా రాధ అలాగే వుంది. కన్నమ్మని ఆస్పత్రికి పంపించింది. సత్యన్నారాయణతో మామూలుగానే మాట్లాడింది—లోపిం చిందల్లా మొహంమీద ఎప్పుడూ తారట్లాడే చిరునవ్వు.

రాత్రి భోజనా లయ్యాయి—

రాధ పుస్తకం పట్టుకుని కూర్చుంది పిల్లల దగ్గిర.

సత్యన్నారాయణ వచ్చి రాధ పక్కన కూర్చున్నాడు.

ఏదో పలకరించాడు.

ఏదో జవాబు చెప్పింది.

"కన్నమ్మ గురించి డాక్టరుగారేం చెప్పారు?" అన్నాడు.

"ఇంజక్షన్లవీ ఇస్తున్నారు. ఇప్పుడు దగ్గు బాగా తగ్గింది"

"తగ్గినట్టే తగ్గినా — నమ్మకూడదు. ఏమో ! టి. బి. అంటే మాటలా? వెరీ డేంజరస్ డిసీజ్— పిల్లలున్న యిల్లు."

"మీరనేదేమిటి?" తలఎత్తి చూసింది రాధ.

"మనం అంత రిస్కెందుకు తీసుకోవాలి? పనిమనిషేగా నీకు కావలసింది? పది రూపాయలు పడేస్తే ఎవరైనా దొరుకుతారు — మన ఆరోగ్యాలు ముందు చూసుకోవాలిగాని."

"ఇప్పుడు మన ఆరోగ్యానికేం వచ్చింది? టి. బి. కాకపోతే తగ్గి పోతుందని డాక్టరుగారే చెప్పారు కదా?"

"చెప్పే మాత్రం? దానికి టి. బి. కాదని ఖచ్చితంగా తేల్చుకోవా లంటే ఇప్పుడు ఏభయ్యో, అరవయ్యో తగలేసి టెస్టులు చేయించాలి. ఇవంతా మన కెందుకొచ్చిన తద్దినం?"

"…. …. …. …."

"అయినా ఎల్లకాలం ఒక మనిషిని మేపటం ఎంతకష్టం. దానికి రెండుపూటలూ భోజనాలూ–టిఫీన్లూ–కాఫీలూ– ఆ కుర్ర వెధవకి–రోజుకి అర్ధశేరు పాలూ– అంతా లెక్కచూడు ఎంతవుతుందని నీ వుద్దేశం?"

రాధ అసహ్యాన్ని అదిమిపట్టాలని విశ్వప్రయత్నం చేసింది — తొణక్కుండా బెణక్కుండా కూర్చుంది — "మొట్టమొదట మిమ్మల్ని అడిగే కన్నమ్మని పనిలో పెట్టాను. అప్పుడు మీరు అన్ని ఖర్చులకీ ఒప్పు కున్నారు. కష్టపడి చేస్తోందేమో తింటోందన్నారు. చంటిబిడ్డకి పాలు యివ్వటంకన్నా పుణ్యం లేదన్నారు మరి. ఇప్పుడీ లెక్కలన్నీ ఏమిటి? ఎందుకు ?"

"ఎందుకేమిటి ? ఎల్లకాలం ఒక్కలా జరుగుతుందా ? దాన్ని పోషించి తీరాలని మనకేం రూలా? కష్టపడి బతికేదానికి ఈ ఇల్లేమిటి? ఆ యిల్లేమిటి?…. ఎక్కడైనా పొట్ట నింపుకొంటుంది. మన ఇంట్లో ఎందుకుంచుకోవాలి ?"

"ఎందుకుంచుకో కూడదు? చెప్పే ఈ క్షణంలో వెళ్ళిపొమ్మని చెప్తాను — కన్నమ్మ గురించి మీ అభిప్రాయం ఎందుకిలా మారి పోయింది?"

"నా పిల్లల ఆరోగ్యం నాకు ముఖ్యం. టి. బి. ఉన్నదాన్ని నెత్తి నెక్కించుకునే విశాల హృదయం లేదునాకు"— సత్యన్నారాయణ లేచి నుంచున్నాడు.

"విశాలత్వందాకా ఎందుకు? అసలు నీకు హృదయం ఎక్క డిది?" గుండెల్లో కొట్లాడిందామాట— నిశ్శబ్దంగా నిట్టూర్చింది రాధ.

సత్యన్నారాయణ మాట్లాడిన ప్రతిమాటకీ ఎదురు ప్రశ్నవేసి నోరు

ముాయించటానికి కావలసినంత శక్తివుంది రాధకి. అయినా అంత నీచమైన తర్కానికి దిగటం ఆమె కిష్టంలేదు.

ఇద్దరూ ఎడమొహం పెడమొహంగా కూర్చున్నారు కాస్సేపు. సత్యన్నారాయణ లేచి మంచంమీదికి వెళ్ళాడు. రాధ లైటార్పి పిల్లల దగ్గిరే పడుకుంది.

తెల్లవారింది.

ఎంకడు గుక్కపట్టి ఏడుస్తోంటే రాధకి మెలకువ వొచ్చింది. లేచి బయటికి వచ్చి "ఎందుకలా ఏడుస్తున్నాడు? రాత్రి కూడా అప్పుడప్పుడూ ఏడవటం వినపడిందే" అని పరామర్శించింది.

"నిన్న సందేలనుంచీ ఆడికి ఒకటే యిరోసినాలమ్మా! పెద్దబ్బాయిగారు బిస్కట్టు ముక్కెట్టారు. పోనీ తింటున్నాడు కదా అనుకున్నాను. అజీర్తి చేసిందేమోనమ్మా-తెల్లార్లూ ఏకేడుపే. కంటిమీద కునుకు లేదు. కడుపులో నొప్పో ఏంటో?" బిక్కమొహం వేసుకుని చెప్పింది కన్నమ్మ.

"ఆ గిన్నెలేవో తర్వాత కడగొచ్చులే. ముందు కాస్సేపు వాణ్ణెత్తుకో. నెమ్మదిగా నిద్రపుచ్చు. ఆనక డాక్టరుగారి దగ్గిరికి తీసుకెళ్ళు. ఫర్వాలేదు. అవే తగ్గిపోతాయి. చంటిపిల్లలన్నాక ఏమీ రాకుండా ఉంటుందా?" అంటూ రాధ మొహం కడుక్కోటానికి వెళ్ళింది.

కన్నమ్మ లేచివచ్చి కొడుకుని ఒళ్లోపెట్టుకు కూర్చుంది. కావలసిన గిన్నెలేవో రాధే కడుక్కుని టిఫిన్లూ-కాఫీలూ తయారుచేసింది.

సత్యన్నారాయణ లేచి మొహం కడుక్కోటానికి బాత్‌రూంలో కెళ్ళి వెనక్కి వచ్చాడు చిరాకు పడిపోతూ—

"రాధా! ఏవిటా గుడ్డలు గదిలో? స్నానం చేసేదెలాగ? కాస్త నీట్‌గా వుంచాలన్న ధ్యాస వుండదేం నీకు?"

"ఏం గుడ్డలూ? .... ఎక్కడా?" తెల్లబోయింది రాధ.

"పిలోడి గుడ్డలమ్మా! .... ఆనక వుతుకుదామని ఒక మూల పడేశా" పిల్లాణ్ణి కింద పడుకోబెట్టి బాత్ రూమ్‌లోకి పరిగెత్తింది కన్నమ్మ—గది అంతా శుభ్రంగా కడిగి బయటకొచ్చింది.

సత్యన్నారాయణ మొహం కడుక్కుని స్నానం చేశాడు. రాధ ఉప్మాప్లేటు గదిలోకి తీసికెళ్ళింది—

"రాత్రంతా.... ఏడుస్తోనే వున్నాడు కుర్రవెధవ. అసలు నిద్ర పడితేనా?" అన్నాడు స్వగతంలాగ.

ఒద్దనుకుంటూనే జవాబు చెప్పింది రాధ— "వాడికి కొంచెం బాగా లేదు."

"చంటపిల్లలన్న తర్వాత ఏదో ఒకటి వస్తూనే ఉంటుంది ఎన్నాళ్ళీ గోల ఇంట్లో ?"

"............"

"మళ్ళా చెప్తున్నాను. కన్నమ్మ వుండటం నా కిష్టంలేదు. ఎక్కడైనా ఇల్లు చూసుకోమని చెప్పు — రేపట్నుంచి మళ్లా అప్పలమ్మని పనిలోకి రమ్మని చెప్తాను సాయంత్రం."

రాధ మౌనంగా యివతల కొచ్చేసింది.

రాధ మొహంకేసి వుల్కూ వుల్కూ చూసింది కన్నమ్మ. రాధ చటుక్కున మొహం తప్పించి వంటింట్లో కెళ్ళిపోయింది. పది గంటలు దాటిం తర్వాత పిల్లాణ్ణి ఆస్పత్రికి పంపించింది—

కన్నమ్మ తన దగ్గుకి— పిల్లాడి విరోచనాలకీ కూడా మందులు తెచ్చుకుంది.

"అమ్మా! పొద్దున్న బాబేటో అంటున్నారే!" భయం భయంగా అడిగింది కన్నమ్మ. ఆ ముక్క అడగాలని దాని మనసు కొట్టుకులాడు తొంది.

జవాబు చెప్పకుండా రాధ ఎదురు ప్రశ్న వేసింది—

"ఎవరింట్లో ఉంటే మాత్రం నీ కెన్నాళ్ళు గడుస్తుంది కన్నమ్మా? పోనీ మీ అన్న దగ్గిర కెళ్ళిపోతావా ?"

దిగాలుగా చూసింది కన్నమ్మ "ఆడు రానివ్వడమ్మా!"

"నీ మొగుడెక్కడున్నాడో వాకబు చేస్తే తెలుస్తుందేమో!"

"ఆడికోసం.... ఎక్కడ తిరగనమ్మా ?"

"ఇంకెవ్వరూ లేరా ?"

కన్నమ్మ కళ్ళు పూడుకొస్తున్నాయి - "మీకు తెలవందేంటుం డమ్మా? ఎవ్వరూ లేరు. ఉన్నోళ్ళు నన్ను రానివ్వరు" రాధకి, తనే ఏడ్చేస్తానేమోనని భయం వేసింది. నిశ్శబ్దంగా ఊరుకుంది

సాయంత్రం సత్యన్నారాయణ ఇంటి కొచ్చాడు. కాఫీ తాగాడు. చీకటి పడేవరకూ ఆఖరి కొడుకు నెత్తుకు తిరిగాడు.

రాధ పిల్లలకి అన్నాలు పెట్టింది.

"మీకు అన్నం వడ్డించనా?" అంది మొగుణ్ణి ఉద్దేశించి.

"తింటాలే. కన్నమ్మకు చెప్పావా ?"

"........."

"ఏం? మాట్లాడవేం? మాటడుగుతోంటే అంత నిర్లక్ష్యం "

"కన్నమ్మ! కన్నమ్మ! కన్నమ్మంటే ఎందుకు మీకు ద్వేషం ?" రేచ్చిపోయాడు సత్యన్నారాయణ — "కన్నమ్మంటే నీ కెందుకు ప్రేమ? ఏమిటా లాలోచీ దానితో?— ఆఫ్టరాల్ పనిమనిషి విషయంలో ఇంత పంతం ఎందుకు? నా కిష్టంలేదని చెప్పానే— పొమ్మని చెప్పరాదూ?"

రాధ మాట్లాడలేదు. కొయ్యబొమ్మలా నించుంది.

"అమ్మా!" వరండాలో నించున్న కన్నమ్మ తెగించి పిల్చింది

"అమ్మా ఒక్కసారిలా రండి" దాని మాటల్లో కంపన స్పష్టంగా తెలుస్తోంది.

రాధ గాలిలో అడుగులేసినట్టు నడుస్తూ బయటి కెళ్ళింది — కన్నమ్మ చంకలో పిల్లాణ్ణెత్తుకుంది. కుడిచేతిలో మూట ఉంది. "అమ్మా దయుంచండి— ఎళ్తాను."

"ఎక్కడికి?" నోటి చివర కొచ్చినమాట బలవంతం మీద ఆపు కుంది రాధ. "కన్నమ్మా! ఇప్పుడెక్కడికి? చీకటి పడిపోయింది — పోనీ రేపు — వెళ్ళుదుగానిలే."

"ఒద్దమ్మా! ఎప్పుడైతేనేంటి? రేపు రేత్రికి మళ్ళా చీకటి పడదా? ఎళ్తానమ్మా — పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోండి."

"కన్నమ్మా! ఉండు ఎస్తాను."

రాధ గబగబా లోపలి కెళ్ళింది. తన పెట్టెతీసి హేండ్ బాగ్‌లో ఉన్న యాభై రూపాయిలు తీసుకొచ్చింది. అప్పటికే కన్నమ్మ దొడ్డి గుమ్మందాకా వెళ్ళి నించుంది.

"కన్నమ్మా! ఇదిగో. కొంచెం డబ్బు. నీ దగ్గరుంచుకో — రేపట్నుంచి బోలెడవసరం వుంటుంది."

నోట్లుచూసి భయపడింది కన్నమ్మ— నా కెందుకమ్మా ! బాబు మిమ్మల్ని—"

"ఇది నా డబ్బే! మొన్న మా నాయనమ్మ ఇచ్చింది - తొందరగా సంచిలో పెట్టు. జాగ్రత. వెంకడు జాగ్రత్త" వాడికి మందు వెయ్యటం మర్చిపోకు. రాధ గొంతు పూడుకొచ్చింది.

కన్నమ్మ నోరు పెగలటంలేదు. "అమ్మా! - ఈ ముండని మర్చిపోకండమ్మా !"

"పిచ్చిముండా! ఈ లోకంలో ఎలా బ్రతుకుతావే!" మాటలు పైకి రాలేదు. "ఎన్ని కష్టాలొచ్చినా సరే! ప్రాణాలమిద విరక్తి పెట్టుకోకు" అని చెప్పాలనిపించింది. చెప్పలేదు— దాని మార్గం మూసెయ్యలేక.

కన్నమ్మ దొడ్డి గుమ్మం దాటింది. చీకట్ని జడిపిస్తోన్నట్టు కళ్ళు చిట్లించి చూసింది పిల్లాణ్ణి భుజంమీద వేసుకుని మూట ఈడ్చుకుంటూ నడవటం మొదలెట్టింది. బాగా దూరం అయిపోయింది.

రాధ గుమ్మాన్ని కావలించుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. ఉద్రృతం తగ్గిన తర్వాత కళ్ళు తుడుచుకుంది. దొడ్డి తలుపులు గడియ పెట్టింది — బాత్‌రూమ్‌లో కెళ్ళి మొహం కడుక్కొంది.

సత్యన్నారాయణ వీధి వరండాలో పేము కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు.

రాధ వెళ్ళి పిల్లల దగ్గిర పడుకుంది.

"వెళ్ళిపోయింది కన్నమ్మ. హోరున గాలిలో దీపం పెట్టినట్టు దిక్కూ మొక్కూలేని లోకంలోకి వెళ్ళిపోయింది.

ఆలోచిస్తే కన్నమ్మ బ్రతుక్కన్నా తన బ్రతుక్కన్న రక్షణే మిటి? తిండీ-గుడ్డా ఇచ్చే మొగుడొక డుండడమేనా? ఏ క్షణంలో ఏం చేస్తాడో తెలీని మొగుడి అండేనా?

గప్పున గుర్తు వచ్చింది లీల.

"లీలా!— నువ్వెంత గొప్పదానివే! మనుషుల్ని క్షుణ్ణంగా చదవ గలవు. నా నమ్మకాలు వమ్మయితే - నా గుండె పగిలి చచ్చిపోతా నన్నావు. ఇందులో మాత్రం పొరపడ్డావు. నేనేమీ అయిపోలేదు. నిక్షే పంలా తిని తిరుగుతున్నాను. ఒకటి మాత్రం చెప్పాలి. ఈ ఘోరం నా ప్రాణాలు తియ్యకపోయినా- నా మనోలోకాన్ని కలిచి వేసింది. గతాన్ని అ స్తవ్యస్తం చేసింది. నాకు కనువిప్పు కల్గించి మనిషిగా మార్చింది. లీలా! ఈ దారుణం గురించి నీకు రాయకుండా వుంటే నాకు నేను ద్రోహం- చేసుకున్నదాన్ని అవుతాను." మనసులో లీలకి రాస్తోన్న ఉత్తరం పుటలకి పుటలే పెరిగిపోతోంది-రాధ ఆవేశంగా లేచింది-లైటు వేసి- టేబుల్ ముందు కూర్చుంది- కలం కాయితాలు తీసుకుంది.

లీలా! నా సంసారంలో నిజమైన విలువలేమిటో నే నిప్పటికి తెలుసుకున్నాను- నా గర్వం పటాపంచలైపోయింది. నాకు-సిగ్గు ముంచు కొస్తోంది- లీలా! - నిజం చెప్పనా -?"

"రాధా!"

తృళ్ళిపడి అడిగింది రాధ కలం. నిస్తేజంగా చూసింది రాధ.

సత్యన్నారాయణ మొహం చిరునవ్వుతో ప్రకాశిస్తోంది.

తల తిప్పుకుంది రాధ.

"ఏం రాస్తున్నావు?"

"ఏదో ఉత్తరం-" రాధ ఉత్తరం ఆపుజేసి లేచిపోయింది. గబా గబా గదిలోంచి బయటికి వెళ్ళిపోయింది.

"రాధా!" వెతుక్కుంటూ వెళ్ళాడు సత్యన్నారాయణ.

మధ్య గదిలో - చీకట్లో - కిటికీ దగ్గిర కూర్చునివుంది రాధ.

సత్యన్నారాయణ లైటు వేశాడు. రాధ దగ్గిరికి వెళ్ళాడు. భుజాలమీద చేతులేశాడు. రాధా! కోపంగా వుందా ?"

"…… …… ……"

"నీకిది ధర్మంగా వుందా ? ఎందుకు కోపం చెప్పు?"

రాధ తల అడ్డంగా వూపింది. భుజాలమీద చేతులు తప్పించింది.

"నా మనసేం బాగాలేదు. మీరు వెళ్ళండి" అజ్ఞాపిస్తోన్నట్టే అంది.

సత్యన్నారాయణ మొహంలో కోపం తొంగిచూసింది. "నీ మనస్సెందుకు బాగాలేదో నాకు తెలుసు. ఒక ముష్టిదాని గురించి ఎందుకింతాలోచన ?"

తలఎత్తి తీక్షణంగా చూసింది రాధ. కళ్ళల్లో అంతుపట్టని ధైర్యం తిష్టవేసింది. "ముష్టిదా? అది ముష్టిదెలా అయిందో తెలుసా ? నీతికి నిలబడి ముష్టిదైంది. విశ్వాస ఘాతుకం చెయ్యలేక ముష్టిదైంది. దానికి లోకజ్ఞానం వుంటే చీరలూ, రవికెలూ, నగలూ, నాణ్యాలూ ఎన్నో సంపాదించేది. దాన్ని అందలం ఎక్కించేవాళ్ళూ, దాని కొడుక్కి చదువు సంధ్యలు చెప్పించేవాళ్ళూ తయారయ్యారు. అన్నీ తిరస్కరించి అది ముష్టిదానిలా వెళ్ళిపోయింది.

సత్యన్నారాయణ తెల్లబోయాడు. విషయం రాధకి తెలిసిపోయినట్టు స్పష్టంగా తెలుస్తోంది. ధైర్యం కూడగట్టుకున్నాడు.

"ఏమిటి నువ్వంటోంది ? ఎవర్ని గురించి ?"

"ఇంకెవర్ని గురించి? ఆ ముష్టిదాన్ని గురించి. దాని చరిత్రంతా మీకు చెప్పానే! చుట్టూ వేటగాళ్ళు వలలు పన్నుతుంటే జడిసిపోయి పిట్టలా అది ఈ ఇంటి కొచ్చింది. ఇక్కడ దాని కెలాంటి అన్యాయమూ జరగదని నచ్చచెప్పాను. ఇదొక దేవతలఆశ్రమంఅని మురిసిపోయింది"

"అవును. అయితే ఏం? దానికేం జరిగింది ?"

"ఎందుకీ నటన? ఈ నైచ్యానికి అంతం లేదా ?"

"రాధా! నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నావు. అది చెప్పిందంతా నమ్మటమేనా? నన్ను మించిన విలువ ఇస్తున్నావా దానికి."

నిజంగా మీకన్నా కొన్ని కోట్ల రెట్లు ఎక్కువ అది నాకు. మిమ్మల్ని శాస్త్రోక్తంగా పెళ్ళిచేసుకుని-మీకు నా సర్వస్వం అర్పించుకుని- మీ కష్టసుఖాలు నావిగా చూసుకుని - మిమ్మల్ని నమ్మి - మీతో పదేళ్ళనుంచీ కాపరం చేస్తోన్న నాకు - మర్చిపోలేని ద్రోహం చెయ్యటానికి ప్రయత్నించారు మీరు. కానీ అది కష్టంలో నేను చేరదీశానన్న విశ్వాసంకొద్దీ తన బ్రతుకయినా బజారుపాలు చేసుకోవటానికి సిద్ధపడింది గానీ నాకు ద్రోహం తలపెట్టలేదు. ఎవర్ని నమ్మాలి నేను? మనిషినే అయితే ఎవర్ని ప్రేమించాలి? ఎవరు ఎక్కువ నాకు?

ఇంతకాలం నేను దాన్ని ఒక పనిమనిషిగా మాత్రమే చూశాను. కడుపునిండా తిండి పెట్టాను. కట్టుకోటానికి గుడ్డలిచ్చాను. కష్టం వస్తే ఆదుకున్నాను. ఇదంతా కనికరంతో చేశాను.

కానీ మీరు చేసిందేమిటి? మీ ప్రేయసికిచ్చే స్థానం ఇచ్చారు. మీ పక్కలో అర్ధభాగం ఇచ్చి ఆహ్వానించారు. దాని కొడుకుని చదివించి ఉద్ధరించి, పెద్దవాణ్ణి చేస్తామని వాగ్దానాలు చేశారు. దాన్ని ఒప్పించటానికి పడరాని శ్రమలు పడారు. కాలే కడుపుకోసం పట్టెడన్నం అడుక్కోవటం ముష్టితనమైతే, ఆ ముష్టిదాన్ని కాళ్ళా వేళ్ళా పడి అర్థించటం ఏమౌతుంది? దొరతనమా? మగతనమా?"

సత్యన్నారాయణ పచార్లు సాగించాడు. హఠాత్తుగా ఒకచోట నిలబడి వెటకారంగ అన్నాడు "అది చాలా మంచిదన్నావుగా? ఎంత మంచిదో చూద్దామని."

అసలది అంత మంచిగా ఎందుకుండాలని. అంతేనా? ఎలాంటిదని ఋజువైంది? చాలా చెడ్డదని కదూ? మీ మగతనానికి దాని ఒళ్ళు ఎర పెట్టలేదు కదూ? అందుకేనా దాన్ని తరిమికొట్టారు? అందుకేనా దానికి నిలవనీడ లేకుండా చేశారు? మీ శరీరంలో అంతరాత్మ లేదా? మీ మికంలో మానవత్వం లేదా?

క్షయ దగ్గుతో బాధపడే దానికోసం అశ్రులు చాచిన మీరు ఆరోగ్యం గురించి ఉపన్యాసం ఇస్తే నోరుమూసుకుని విన్నాను. దాని కేలోటూ లేకుండా పోషిస్తానని వాగ్దానాలు చేసి, ఇవ్వాళ మనిషిని మేపటం చాలా కష్టమంటే విని భరించాను. ఎందుకు? ఆ దౌర్భాగ్యురాలికోసం — ఆ దిక్కులేని పక్షికోసం – కానీ నేనేం చెయ్యగలిగాను? "ఏం చెయ్య గలిగాను?"

సత్యన్నారాయణ స్తంభంలా నించున్నాడు తదేకంగా చూస్తూ. రాధ ఏమీ పట్టనట్టు కిటికీలోంచి చీకట్లోకి చూస్తూ కూర్చుంది.

సత్యన్నారాయణ నెమ్మదిగా దగ్గిరికి వెళ్లాడు. "రాధా! ఒక్క మాట చెప్పు. నిన్ను నేను ప్రేమించటంలేదా?" అనునయంగా అడిగాడు.

వినరానిమాట విన్నంత ఛీత్కరించుకుంది రాధ. "ప్రేమ! అహా! ఈ ప్రేమని చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాలి. కవులంతా ముక్త కంఠంతో గానం చెయ్యాలి. ఆ హా హా! ఎంత గొప్ప ప్రేమ! కన్నమ్మ మీరు చెప్పినట్టు ఒప్పుకొనివుంటే మీ ప్రేమ ఇంకా ద్విగుణీకృతం అయ్యేది. నేను మిమ్మల్ని నమ్మాను. కన్నమ్మనీ నమ్మాను. ఒకరికంటే ఒకర్ని గాఢంగా నమ్మాను.

కానీ మీరనుకున్నట్టు జరిగితే.... తర్వాతకూడా మీరిద్దరూ నా చాటున నాటకం ఆడేవారు. చూపులూ, నవ్వులూ, మాటలూ నా వెనక జరుగుతూనే వుండేవి. నేను వుత్త చచ్చుపెళ్లాన్ని. అది మాత్రం మీ హృదయ సామ్రాజ్యరాణి. కొన్నాళ్ళకి అదే నన్ను పనిమనిషిగా వుంచు కునే స్థితికి వచ్చేది. మీ సంబంధం సంవత్సరాల తరబడీ సాగుతూ వుండేది. దాని కొడుకు పెద్దవాడై చదువు సంధ్యలు నేర్చేవరకూ ఒక ముష్టిది, రోగిష్టి – మీకు నాకన్నా అధికమైంది. నామీద ఉన్న అభిమానం కన్నా దానిమీద కలిగిన కోరిక బలీయమైపోయింది. ఇన్నేళ్ళూ నాతో చేసిన సహచర్యం ఒక క్షుద్రురాలిమీద కాంక్షని జయించలేకపోయింది. అది నాకన్నా అందమైందా? నాకన్నా మిమ్మల్ని ప్రేమిస్తోందా? పెళ్లాని కయితే అందచందాలు కావాలి. ఒంపుసొంపులు ఉండాలి; మొగుడికోసమే

ఆత్మార్పణ చేసుకోవాలి. పరాయి ఆడదాని కేమీ అక్కర్లేదు. ఎలావున్నా రంభలా కనిపిస్తుంది. ఎడంకాలితో విసిరికొట్టినా మహా బాగానిపిస్తుంది. శరీరసుఖం దొరికితే చాలా ? మనస్సుకి సంతృప్తి అక్కర్లేదా?

నా వెనక ఇంత తతంగం నడిపి, వుంపుడుగత్తె కోసం యింత ప్రయత్నంచేసి, ఇదంతా నాకు తెలిసిం తర్వాతకూడా— "రాధా! నిన్ను ప్రేమించటంలేదా!" అంటోంటే, ఆహా! మీ సాహసానికి మెచ్చుకు తీరాలి నేను" రాధ మొహమంతా చెమటలు పట్టింది. బొట్టు కరిగి చారిక కట్టింది.

సత్యన్నారాయణ స్థాణువై పోయి నించున్నాడు. నిజంగా ఆ దంపతులమధ్య ఇంత దారుణమయిన ఘట్టం ఎప్పుడూ జరగలేదు. రాధ కోపిష్టి కాదు. సత్యన్నారాయణా శాంతమూర్తే ఎప్పుడూ వాళ్ళ అభిప్రాయాలు అంతగా భేదించలేదు. ఇంత భయంకరమైన సమస్యలు రేకెత్తలేదు. ఇంత జుగుప్సాకరమైన సంభాషణ జరగలేదు.

సత్యన్నారాయణ మాట్లాడలేకపోయాడు చాలా సేపు. "రాధా! నువ్వు ఎన్ని అన్నా నేను పడాలి. అంత బుద్ధిలేని పని చేశాను. కానీ కొంచెం శాంతంగా నా మాటకూడా విను. కన్నమ్మ నీకన్నా ఎప్పుడూ ఎక్కువకాదు. దానికీ నీకూ పోలికేలేదు. ఆ రోజు ఇంట్లో ఎవ్వరూ లేరు. అది ఒక్కతే వుంది. నా బుద్ధి పెడదారులు పట్టింది. అది ఒప్పుకుంటే చాలని ఏమేమో చెప్పాను. అవన్నీ వుత్త కబుర్లు. దాని అవసరం తీరిపోతే నేనేం చెప్పానో కూడా నాకు జ్ఞాపకం వుండదు."

"భగవంతుడా!" చెవులు మూసుకుంది రాధ వినలేక. "మీ నీచత్వం ఇన్ని వెర్రితలలు వేసిందా? మనం సీతా రాములం అనుకుని మన నీడలో తలదాచుకుందా అమాయకురాలు. మిమ్మల్నినమ్మి వెళ్ళిపోయాను. మీమీద పుట్టెడు విశ్వాసం పెట్టుకొని మీదగ్గర ఒంటరిగావున్న ఒక అనాధని వెయ్యి కళ్ళతో రక్షించాలని మీకు తోచనేలేదా? పరాయి ఆడది మీకు తల్లిగా కనిపించకూడదా? తోబుట్టువుగా కనిపించకూడదా? జుగుప్సాకర

మైన క్షణికమైన సంబంధం తప్పితే స్త్రీనుంచి మీ కే అనుభూతులూ అక్కర్లేదా?

పెద్దమనుషులనీ, బుద్ధిమంతులనీ పేరుప్రఖ్యాతులు మీకు. దిక్కు లేని ఒక ఆడదానికి రక్షణ యివ్వలేకపోవడం సిగ్గుచేటు కాదా? దాన్ని పిల్చి మాయమాటలు చెప్పి నమ్మించి నాశనంచేసి, దేవుడా! నా గుండె బద్దలవుతోంది. ఎందుకు నన్నింత చిత్రహింస పెడుతున్నావు?" వెక్కి వెక్కి ఏడుస్తూ గోడకి తల ఆన్చి నించుంది రాధ. రాధ ఎప్పుడూ అలా బోరున ఏడవలేదు.

సత్యన్నారాయణ కంపించి పోయాడు. "రాధా! నే నెంత పశ్చాత్తాప్పడుతున్నానో నీకు తెలీదు."

రాధ అదిరిపడింది. "పశ్చాత్తాపం! ఎవరికీ? మీకా? అబద్ధాలకింకా అబద్ధాలు జోడించి ఎందుకిలా పతనమైపోతారు? పశ్చాత్తాపం పగ కోరు తుందా? పశ్చాత్తాపం రాక్షసుణ్ని చేస్తుందా? మీరు పశ్చాత్తాప పడటం నిజమైతే కన్నమ్మ కాళ్ళమీద పడి ఏడ్చేవారు. మిమ్మల్నొక నైచ్యా న్నుంచి రక్షించినందుకు దానికి జీవితమంతా ఋణపడి వుండేవారు. కానీ మీరు చేసిందేమిటి?

"రాధా! నిజంగా నాకు కన్నమ్మమీద కోపం లేదు. అది జరిగిం దంతా నీకు చెప్పేస్తుందేమోనని భయపడ్డాను. దాన్ని ఎంత తొందరగా యింట్లోంచి పంపిస్తే అంత మంచిదనుకున్నాను."

"దాన్ని ఇంట్లోంచి వెళ్ళగొట్టారు. మీరు చేసిన నేరం మీ మనసు లోంచి తుడిచి పెట్టుకుపోయిందా? ఒక తప్పు దాచుకోవడానికి మార్గం మరో తప్పు చెయ్యటమా? కన్నమ్మకి జీవితంమీద విరక్తి పుట్టి ఆత్మ హత్య చేసుకుంటే ఎవరు బాధ్యులు? మీరు కాదా? ఇవాళ కాకపోతే ఈ విషయం రేపైనా తెలుస్తుంది మీకు."

సత్యన్నారాయణ మొహం పాలిపోయింది. మాట్లాడటానికూడా ధైర్యం తెచ్చుకోవాల్సి వచ్చింది —

"రాధా ! నన్ను .... క్షమించు. ఇంతకన్నా నేనేమీ చెప్పలేను." రాధ మొహంమీద చెమటని అసవ్యస్తంగా తుడుచుకుంది. తిలకం కరిగి మొహంనిండా భయంకరంగా తయారయింది. "తెలుసు. తెలుసు. చివరికి మీరు క్షమించమంటారని నాకు మొదటే."

రాధ ఒక్కసారి కళ్లెత్తి మొగుడి మొహంలోకి చూసింది — "కానీ– ఇలాంటి నమ్మకద్రోహం నేను చేస్తే? మీరు లేని సమయంలో ఏ ఆఫీసు బంట్రోతునో మన పడక గదిలోకి ఆహ్వానిస్తే? ఆ సంగతి మీకు తెలిస్తే? ఏం చేస్తారు? నేను చెప్పనా? నన్ను అడగటం ఉండదు. నేను చెప్పేది వినటం వుండదు. హఠాత్తుగా కంఠం నలిపి చంపేస్తారు? ఏ కత్తితోనో గుండెలో పొడిచి కసి తీర్చుకుంటారు. ఈ సరికి నా శరీరం శ్మశానంలో మసై .. బూడిదై .... గాలిలో కలిసి పోయేది. కానీ మీరు చేస్తే.... క్షమించాలి నేను. ఆడదాని కింకేం చేతనౌతుందీ ? .... క్షమించకేం చేస్తుంది? మీ నమ్మకంలాంటి నమ్మకం కాదు నాది. మీబాధ లాంటి బాధ కాదు నాది. మీ మనసులాంటి మనసే కాదు నాది. క్షమించాలి నేను. ఎంత తేలిగ్గా అడిగారూ!— కన్నమ్మ తిరస్కరించిన క్షణం లోనే మీ వొంటి మైకం విడిపోయి – కన్నమ్మ నొక మంచి మనిషిగా గుర్తించి – జరిగిందంతా నిజాయితీగా నాకు చెప్పేస్తే– అది నిజమైన పశ్చాత్తాపం అని నమ్మేదాన్ని అప్పుడు. అప్పుడు నేను మనస్ఫూర్తిగా మిమ్మల్ని క్షమించేదాన్ని.

కానీ.... ఇప్పుడు నాచేత కాదు. మిమ్మల్ని క్షమించి నేను పశువుని కాలేను. మిమ్మల్ని ద్వేషించి మనిషి నౌతాను.

సత్యన్నారాయణ అహం దారుణంగా గాయపడింది.

"నేను తొందరపడి తప్పుచేశాను. నిజమే. ఇది మగవాడెవడైనా సహజంగా చేసే తప్పు. క్షమించమని కోరుతున్నానుకదా?" రెండడుగులు వేసి రాధ దగ్గిరికివెళ్ళి చేతులు పట్టుకున్నాడు.

రాధ అయిష్టంగా విడిపించుకుంది – "నేను చెప్పాల్సిందంతా చెప్పాను. అనవసరంగా వాదన పొడిగించుకోవద్దు నా స్థానంలోకి మరో

ఆడదాన్ని ఆహ్వానించిన క్షణంలోనే మీ మనసు మారిపోయింది. నే నిది జీవితాంతం మర్చిపోలేను. గుండెల్లో జ్ఞాపకం పెట్టుకుని మీతో వ్యభిచారం చెయ్యలేను.

దాంపత్య జీవితం చాలా సున్నితమైంది. సుఖప్రదమైంది. ఎంతో పవిత్రమైంది. అది ఆ మార్గంలోనే సాగాలి. గాడి తప్పినప్పుడల్లా సరి చేసుకుంటూ వుండటానికి ఇది ఎడ్లబండి కాదు. అర్హతలేని మనకి పెళ్ళిళ్ళెందుకు? పశువుల్లాగే మనుషులకి కూడా వివాహాలు చేసుకునే యోగ్యత లేదు. ఆ స్థితికి మనిషి ఇంకా పెరగలేదు.

రాధ ధోరణికి సత్యన్నారాయణ తెల్లబోయాడు. ఆశ్చర్య పోయాడు "రాధా! ఏమిటిది? నీ కోపానికి మాత్రం అంతం ఉండక్కర్లేదా?" రాధ నిష్కర్షగా అంది. "ఇది కోపం కాదు. ఈ సమస్యకి పరిష్కారం. ఇంతకన్నా మనిషిగా నేను ఆలోచించగలిగేదేమీ లేదు."

"ఎన్నాళ్ళు అలాగ?"

"జీవితమంతా."

రాధ మాటల్లో గాంభీర్యం అప్పటికిగాని అంతు చిక్కలేదు. సత్యన్నారాయణ వెర్రి ప్రశ్న వేశాడు. "ఎలా వుండగలం?"

"నే నుండగలను. ఇక నాకీ సంసారంలో ఏముందీ? ఎవరికోసం నా మనసుని చంపుకోవాలి? కాని మీ రుండాలని నే ననటంలేదు. ర ప్రవర్తన గురించి నేను ప్రశ్నించను. ఇప్పుడు నాకా అవసరంలేదు."

"ఒక్క ఇంట్లో ఉంటూ—"

"ఒక్క ఇంట్లో వుండటం వీలుకాకపోతే ఎవరిదారిన వాళ్ళుందాం. ఇన్నాళ్ళూ నాకా అవసరం లేకపోయినా ఇక నా తిండి ప్రయత్నాలు నేను జేసుకుంటాను."

కోపంగా, నిస్సహాయంగా అన్నాడు భర్త "మరి పిల్లలు?"

"పిల్లలకేం, మీకయినా పిల్లలే, నాకయినా పిల్లలే. ఎక్కడున్నా వాళ్ళు నిక్షేపంలా వుంటారు."

ఈ రాధ - తనంటే ఎంతో ప్రేమించే రాధ - తనకెంతో విధేయతగా వుండే రాధ —

"రాధా !" సత్యన్నారాయణ ధీరత్వం జడిసింది.

సత్యన్నారాయణ భర్తృత్వం సిగ్గుపడింది.

సత్యన్నారాయణకి మనిషిగా మాట్లాడాలనే తపనకలిగింది. కంపించే గొంతుతో అన్నాడు "రాధా ! ఇప్పుడే వెళ్తాను. ఎక్కడున్నా సరే, వూరంతా గాలించి కన్నమ్మని తీసుకొస్తాను. నీ ఎదరగా ఆ మనిషిని క్షమాపణ కోరుకుంటాను."

సత్యన్నారాయణ నిలబడలేదు. జోళ్ళు వేసుకొని ఇలుదాటి బయటికి వెళ్ళిపోయాడు. "నా తప్పుకి నేనే శిక్ష వేసుకుంటాను" అన్నాడు గట్టిగా.

రాధ వారించాలేదు. హర్షించాలేదు.

ప్రతిమలా కూర్చుంది. కాలం సాఫీగా సాగుతోన్నంత కాలం అందరూ పెద్దమనుషులే! వ్యతిరేకమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చినప్పుడే మనుషుల నైజం బయటపడుతుంది. మనుషులయినదీ, కానిదీ ఋజువు అవుతుంది.

"భగవంతుడా! నువ్వెక్కడున్నావు? నాప్రార్థన నీకు విన్పిస్తోందా? మనో వాక్కాయ కర్మలా సత్యమార్గం తప్పని ఒక్క ప్రేమ మూర్తినైనా నువ్వు సృష్టించలేదా? ప్రేయసినే అర్ధాంగిని చేసుకుని అర్ధాంగిలో ప్రేయసిని చూసుకుని జీవితమంతా పవిత్రంగా బ్రతకగల నిజమయిన భర్తని చూపించు. ఆ పుణ్యపురుషుడి పాదాలకు నమస్కరించి నేను ధన్యురాలినవుతాను."

అది దైవ ప్రార్థనలా లేదు. ఆర్తనాదంలా వుంది.

నిజమైన ప్రేమని దర్శించాలని తపించే రాధ హృదయకుహరాన్ని చీల్చుకువచ్చిన ఆర్తనాదంలా వుంది.

సమర్పితం : ఉంటే .... పుణ్యపురుషుడికి !

(1967 దీపావళి జ్యోతి నుంచి)